
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విశాఖపట్నం
జిల్లా వార్తలు
సోమవారం 25 నవంబరు 2024



చర్యలపై మీనమేషాలు!

- కార్పొరేటర్ అక్రమ నిర్మాణంపై నోటీసులిచ్చి వదిలేసిన జీవీఎంసీ అధికారులు
- మోకాలడ్డుతున్న స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు



ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మించిన భవనం

విశాఖపట్నం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్పొరేటర్‌ననే దర్పంతో నిబంధనలకు విరుద్ధంగా మద్దిలపాలెం కృష్ణాకాలేజీ వెనుక నిర్మించిన భారీ భవనంపై చర్యలకు అధికారులు వెనకాడుతున్నారు. అక్రమాలను కాపాడేందుకు జీవీఎంసీ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడిగా పనిచేస్తున్న ఓ న్యాయవాది రంగంలోకి దిగినట్టు సమాచారం. జీవీఎంసీ జారీచేసిన ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మాణం చేపట్టడంతోపాటు భవనం నిర్మించిన భూమి ప్రభుత్వానిదంటూ ఒకరు హైకోర్టులో వేసిన కేసు పెండింగ్‌లో ఉంది. అయినప్పటికీ కార్పొరేటర్ అధికారాన్ని అడ్డంపెట్టుకుని వైసీపీ నేతల అండదండలతో జీవీఎంసీ అధికారులపై ఒత్తిడి తెచ్చి అడ్డగోలుగా భవన నిర్మాణం పూర్తిచేశారు. నివాసయోగ్యానికి వీలుగా రెండు భవనాల నిర్మాణానికి వేర్వేరుగా ప్లాన్ పొందిన కార్పొరేటర్ ఒకే భవనాన్ని నిర్మించారు. పైగా వాణిజ్య భవనం నిర్మించి అందులో పాఠశాల ఏర్పాటుచేశారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో ఉలిక్కిపడిన జీవీఎంసీ అధికారులు ఆ భవనాన్ని పరిశీలించారు. నిర్మాణంలో సెట్‌బ్యాక్‌లు విడిచిపెట్టలేదని, నివాసయోగ్యానికి బదులుగా వాణిజ్య అవసరాలకు అనుగుణంగా

... మిగతా 6వ పేజీలో

ప్రధాని సభకు భారీ ఏర్పాట్లు



లక్ష మంది హాజరయ్యేలా చర్యలు | జనసమీకరణ బాధ్యత కూటమి పార్టీల నేతలదే



ప్రధాని మోదీ సభకు సిద్ధమవుతున్న ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానం

- ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో ముమ్మర ఏర్పాట్లు
- 29న సాయంత్రం టైకూన్ జంక్షన్ నుంచి ఎస్పీ బంగ్లా వరకు రోడ్‌షో?
- వేదిక వద్ద గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్‌కు శంకుస్థాపన
- పలు జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులను జాతికి అంకితం చేయనున్న ప్రధాని
- విశాఖ రైల్వేజోన్‌కు శంకుస్థాపన, ఉక్కు పరిశ్రమకు ప్యాకేజీ ప్రకటించాలని నేతల వినతి

విశాఖపట్నం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ ఈనెల 29వ తేదీన విశాఖపట్నం రానున్నారు. ఈ సందర్భంగా ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. సుమారు లక్ష మందిని సభకు సమీకరించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. జన సమీకరణ బాధ్యతను ప్రభుత్వం స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీల నాయకులకు అప్పగించింది. ఈ సందర్భంగా వేదిక వద్ద ప్రధానమంత్రి పలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు.

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం పూడిమడక వద్ద ఎన్‌టీపీసీ ఏర్పాటుచేసే గ్రీన్‌హైడ్రోజన్ పవర్‌ప్లాంట్‌కు ప్రధానమంత్రి శంకుస్థాపన చేస్తారు. నిర్మాణాలు పూర్తిచేసుకున్న దక్షిణ, తూర్పుభారతానికి చెందిన పలు జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులను ప్రధాని ఈ వేదిక నుంచే జాతికి అంకితం చేస్తారు. కాగా ఇదే పర్యటనలో విశాఖ కేంద్రంగా ఏర్పాటుకానున్న రైల్వేజోన్‌కు శంకుస్థాపన చేసే కార్యక్రమంలో పొందుపరచాలని స్థానిక నేతలు రాష్ట్రప్రభుత్వం ద్వారా ప్రధాని కార్యాలయాన్ని కోరేందుకు నిర్ణయించారు. రైల్వే జోన్ నిర్మాణాలకు టెండర్లు ఆహ్వానించిన నేపథ్యంలో స్థానిక నేతలు ఈ విషయాన్ని

... మిగతా 6వ పేజీలో

మోదీ పర్యటన సాగేదిలా...

ప్రాథమిక సమాచారం ప్రకారం ప్రధాని ఈనెల 29వ తేదీన సాయంత్రం విమానాశ్రయానికి చేరుకుంటారు. ఓపెన్ టాప్ వాహనంలో ఎయిర్‌పోర్టు నుంచి కాన్వెంట్ జంక్షన్, ఫ్లైఓవర్ మీదుగా టైకూన్ జంక్షన్ వరకు రోడ్డుమార్గాన చేరుకున్న ప్రధాని అక్కడి నుంచి ఎస్పీ బంగ్లా వరకు సుమారు అరకిలోమీటరు పొడవునా రోడ్‌షోలో పాల్గొంటారు. అక్కడి నుంచి వేదిక వద్దకు చేరుకుంటారు. వేదికపై 4.45 గంటల నుంచి సాయంత్రం ఐదుగంటల వరకు గవర్నర్, ముఖ్యమంత్రి, ఇతర మంత్రుల సమక్షంలో ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తారు. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రసంగాల తరువాత సాయంత్రం 5.25 గంటల నుంచి 5.43 గంటల వరకు ప్రధాని నరేంద్రమోదీ ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. అనంతరం 5.45 గంటలకు సభావేదిక నుంచి ఎయిర్‌పోర్టుకు తిరుగుపయనమవుతారు.

సభకు వాన గండం?

ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈనెల 29న విశాఖలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. అయితే బంగాళాఖాతంలో ప్రస్తుతం ఉన్న తీవ్ర అల్పపీడనం బలపడి ఉత్తర తమిళనాడు, కోస్తాంధ్ర వైపుగా వచ్చే అవకాశం ఉండడంతో ఈనెల 27వ తేదీ నుంచి కోస్తాలోని పలు జిల్లాలకు భారీ వర్షసూచన ఉంది. ఈనెల 28 నుంచి 30వతేదీ వరకు అనకాపల్లి, కాకినాడ, విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని విశాఖ తుఫాన్ హెచ్చరిక కేంద్రం ఆదివారం తెలిపింది. దీంతో ఈనెల 29న ప్రధాని సభకు వానగండం ఉండే అవకాశం ఉందని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. అందువల్ల ప్రధాని సభకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉందన్నారు. అయితే ఈనెల 26వ తేదీ నాటికి మరింత స్పష్టత వస్తుందన్నారు.

మహా అక్రమం

జీవీఎంసీలో అస్మదీయ కాంట్రాక్టర్లకే బిల్లుల చెల్లింపు



- వర్క్ సీనియారిటీని పట్టించుకోని అధికారులు
- ఫిబ్రవరిలో పనులు చేసిన వారిని పక్కనపెట్టి.. ఆగస్టు, సెప్టెంబరులో చేసిన వారికి బిల్లుల మంజూరు
- అనారోగ్యం, పిల్లల ఫీజుల పేరుతో కమిషనర్‌కు తప్పుడు వినతులు
- పరిశీలించాలని కిందిస్థాయి అధికారికి సిఫారసు
- అదే అదనుగా ఐదుశాతం కమీషన్ తీసుకుని బిల్లులు చేసిన అధికారి
- చక్రం తిప్పిన కాంట్రాక్ట్ యూనియన్ నేతలకు ఒక శాతం
- అధికారుల తీరుపై మిగిలిన కాంట్రాక్టర్ల ఆగ్రహం

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

జీవీఎంసీ పరిధిలో అభివృద్ధి పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లింపులో అధికారులు వ్యవహరిస్తున్న తీరు వివాదాస్పదమవుతోంది. పని పూర్తిచేసిన సీనియారిటీని పరిగణనలోకి తీసుకోవాల్సిన అధికారులు అస్మదీయులకు అడ్డగోలుగా బిల్లులు చెల్లించడం వివాదానికి కారణమవుతోంది. ఫిబ్రవరిలో పనులు పూర్తిచేసినవారికి బిల్లులు చెల్లించని అధికారులు, ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో పూర్తిచేసినవారికి బిల్లులు చెల్లించడం చర్చనీయాంశంగా మారింది. ఈ ప్రక్రియలో భారీగా కమీషన్లు దండుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

జీవీఎంసీ పరిధిలో ఏటా రూ.వెయ్యి కోట్లు విలువైన అభివృద్ధి పనులు చేపడతారు. జీవీఎంసీ సాధారణ నిధులతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే ప్రత్యేక గ్రాంటుల ద్వారా పనులు పూర్తిచేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తుంటారు. సాధారణంగా ఏదైనా అభివృద్ధి పని చేపడితే ఆ పరిధిలోని వర్క్‌ఇన్‌స్పెక్టర్ లేదా అసిస్టెంట్ ఇంజనీర్ నాణ్యత పరిశీలిస్తారు. పని పూర్తైన తరువాత సంబంధిత ఏఈ కొలతలువేసి ఎం-బుక్ రికార్డు చేస్తారు. ఏఈ రికార్డు చేసిన అంశాలను డీఈ పరిశీస్తారు. అనుమానం ఉంటే పని జరిగిన ప్రాంతానికి వెళ్లి క్షేత్ర పరిశీలన చేస్తారు. సరిగా ఉంటే జనరల్ ఓచర్ నంబరు కేటాయించిన తర్వాత ఫైల్‌ను ఎస్ఈకి పంపిస్తారు. రూ.20 లక్షలలోపు పని అయితే ఆడిట్‌కు పంపిస్తారు. ఆపై మొత్తానికి చెందిన పనిని చీఫ్ ఇంజనీర్ పరిశీలించిన తర్వాత ఈ-ఆఫీస్‌లో కమిషనర్‌కు పంపిస్తారు. కమిషనర్ పరిశీలించిన తర్వాత సీఈ, ఎస్ఈ, ఈఈ వరకూ వస్తుంది. అక్కడ డ్రాయింగ్ బ్రాంచ్‌లో జనరల్ ఓచర్ నంబరు కేటాయించి, బిల్లు ఆడిట్‌కి పంపిస్తారు. ఆడిట్ పరిశీలన తరువాత అకౌంట్స్‌కు వెళ్తుంది. జీవీఎంసీ ఖాతాలో నిధులు ఉన్నపుడు జనరల్ ఓచర్ నంబరు సీరియల్ ఆధారంగా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తారు. కాగా జీవీఎంసీ ఖాతాలో నిధులు కొరత ఉండడంతో బిల్లుల చెల్లింపులో కొంత జాప్యం జరుగుతోంది. దీనివల్ల జీవీఎంసీలో ఇప్పటివరకూ ఫిబ్రవరి 18 నాటికి జనరల్ ఓచర్ నంబరు కేటాయించిన వారికి మాత్రమే

... మిగతా 6వ పేజీలో



పాతగాజువాకలో కార్మిక ప్రదర్శన నిర్వహిస్తున్న ఉక్కు కార్మిక సంఘాలు, నేతలు

ఉక్కుపై ప్రధాని స్పష్టతనివ్వాలి

విశాఖ పర్యటనలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిలిపివేస్తున్నట్టు స్పష్టమైన ప్రకటన చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు పాతగాజువాకలో ఆదివారం భారీ ఎత్తున కార్మిక ప్రదర్శన నిర్వహించారు.

- వివరాలు 7లో

ఆర్టీసీ పంచవైష్ణవ క్షేత్రదర్శని

- మార్గశిర మాసంలో ప్రత్యేక బస్సులు నడపనున్న అధికారులు

ద్వారకాబస్‌స్టేషన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మార్గశిర మాసంలో పంచవైష్ణవాలయాలను దర్శించుకోవాలనుకునే భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక ప్యాకేజీని రూపొందించింది. వచ్చేనెల 7, 14, 21 ,28 తేదీల్లో పంచవైష్ణవి క్షేత్రదర్శిని పేరిట బస్సులు నడపనున్నట్టు ప్రకటించింది. ఆయా తేదీల్లో రాత్రి 9 గంటలకు ద్వారకా బస్‌స్టేషన్ నుంచి బస్సులు బయలుదేరుతాయి. ద్వారకా తిరుమల వెంకటేశ్వరస్వామి, అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి, అప్పన్నపల్లి శ్రీబాలబాలాజీ, గొల్లలమామిడాడ కోదండరాముడు, అన్నవరం శ్రీ వీరవెంకటసత్యనారాయణ స్వామిలను దర్శించుకుని మరుసటి రోజు రాత్రి తిరిగి ద్వారకాబస్‌స్టేషన్‌కు చేరుకుంటాయి. ప్రయాణ చార్జీ ఒక్కొక్కరికి రూ.1800గా నిర్ణయించారు. ఆర్టీసీ వెబ్‌సైట్, ద్వారకాబస్‌స్టేషన్‌లోని రిజర్వేషన్‌కౌంటర్‌లో టికెట్లు బుక్‌చేసుకోవచ్చునని అధికారులు తెలిపారు. వివరాలకు 9959225602, 9052227083, 9959225594, 9100109731 నంబర్లలో సంప్రతించవచ్చన్నారు. పంచవైష్ణవాలయాలను దర్శించాలనుకునే భక్తులు ఈ సేవలు వినియోగించుకోవాలని ఆర్ఎం బి.అప్పలనాయుడు కోరారు.

బెంబేలెత్తిస్తున్న గ్రామసింహాలు

పారిశ్రామిక ప్రాంతంలో కుక్కల స్వైర విహారం

- నియంత్రణపై దృష్టిసారించని జీవీఎంసీ అధికారులు
- పలు సంఘటనల్లో ప్రాణాలు కోల్పోతున్న బాధితులు



86వ వార్డు వుడా నగర్‌లో రోడ్డుపై కుక్కలు

గాజువాక, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక ప్రాంతంలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. గాజువాక జోనల్ పరిధిలో రహదారులపై గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నాయి. ఈ భయంతో ఒంటరిగా బయటకు వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. పిల్లలు కనీసం ఇంటి ముందు ఆడుకోవడానికి కూడా ఆందోళన చెందాల్సిన పరిస్థితి నెలకొందని తల్లిదండ్రులు వాపోతున్నారు. వీధి కుక్కల నియంత్రణపై జీవీఎంసీ అధికారుల నిర్లక్ష్యం శాపంగా

... మిగతా 6వ పేజీలో

చిన్నారిపై వీధి కుక్కల దాడి

- ఫార్మాసిటీ పునరావాస కాలనీలో ఘటన



కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న చిన్నారి

అగనంపూడి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇంటి ముందు ఆడుకుంటున్న చిన్నారిపై వీధి కుక్కలు దాడిచేశాయి. ఒక్కసారిగా మీద పడి శరీరమంతా కరిచేశాయి. దీంతో తీవ్ర గాయాలతో చిన్నారి ప్రస్తుతం కేజీహెచ్‌లో చికిత్స పొందుతోంది. స్థానికులు సకాలంలో చూసి వాటిని తరివేయడంతో ప్రాణాపాయం తప్పింది. ఈ సంఘటన అగనంపూడి ఫార్మాసిటీ పునరావాస కాలనీలో శనివారం జరిగింది. ఫార్మాసిటీ పునరావాస కాలనీ పానకాలయ్యపేటకు చెందిన యక్షిత (3) తన ఇంటి ముందు వీధిరోడ్డుపై ఆడుకుంటోంది. ఆసమయంలో తల్లి లక్ష్మి ఇంటి పనుల్లో ఉండగా, తండ్రి సిద్ధనాతి నూకఅప్పారావు బయటకు వెళ్లాడు. చిన్నారిపై ఒక్కసారిగా రెండు వీధి కుక్కలు దాడి చేసి వీపు, తల భాగంపై తీవ్రంగా గాయపరిచాయి. స్థానికులు పరుగున వచ్చి కుక్కలను తరిమేశారు. చిన్నారిని వెంటనే అగనంపూడి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం కేజీహెచ్‌కు తీసుకెళ్లారు. శరీరంపై బలమైన గాయాలవడంతో చిన్నారి పరిస్థితి విషమంగా ఉందని తల్లిదండ్రులు తెలిపారు. ఈ ప్రాంతంలో వీధి కుక్కల పెరిగిపోయాయని, జీవీఎంసీ అధికారులకు ఎన్నిమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

రైతు బజార్లలో స్టాళ్లకు డిమాండ్

- పైరవీలు చేసే వారికే అవకాశం
- చిట్టివలసలో కానరాని స్పందన
- రూ.30వేలు డిపాజిట్ కోరడమే కారణం?
- దరఖాస్తు చేసుకునేందుకు గడువు పెంపు



(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

జిల్లాలో రైతుబజార్లకు ప్రాధాన్యం పెరిగింది. తాజా కూరగాయలతోపాటు నిత్యావసర సరకులు లభించడంతో వినియోగదారుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ఈ నేపథ్యంలో రైతుబజార్లలో వ్యాపార అవకాశాల కోసం ఆసక్తి కలిగిన వారు రాజకీయ నేతలను ఆశ్రయిస్తున్నారు. కూరగాయలు పండించుకునే రైతులతో పాటు దళారులు, ఉల్లి, టమాటా, పండ్లు, కొబ్బరికాయలు విక్రయించేందుకు స్టాళ్లు ఇప్పించాలని ఎమ్మెల్యేలు, స్థానిక నేతల చుట్టూ తిరుగుతున్నారు. అయితే బజార్లలో స్టాళ్లు ఖాళీ లేవని వ్యవసాయ మార్కెటింగ్ శాఖాధికారులు అవకాశం ఇవ్వడం లేదు. ఎమ్మెల్యేల ఒత్తిడి తట్టుకోలేక దరఖాస్తులు తీసుకునేవారు. ఏడెనిమిదేళ్లుగా ఇవి పెండింగ్‌లో ఉన్నాయి.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత రైతుబజార్లలో మరింత మందికి అవకాశం కల్పించాలని ఆదేశించడంతో ప్రతిరోజూ సాయంత్రం వేళలో కూరగాయలు విక్రయించుకునేందుకు సుమారు 800 మందికి కొత్త కార్డులిచ్చారు. ఈ స్టాళ్ల కేటాయింపులో స్వామి కార్యం, స్వకార్యం జరిగాయనే విమర్శలున్నాయి. దశాబ్ద కాలంలో పెద్దఎత్తున స్టాళ్లకేటాయించడం ఇదే మొదటి సారి కావడంతో ఆశావహుల సంఖ్య పెరుగుతూనే ఉంది. ఇప్పుడు అధికారులే ఎమ్మెల్యేలకు ఫోన్ చేసి, మీ వారి పేర్లు ఉంటే చెప్పండి?' అనే పరిస్థితి వచ్చింది. దీంతో ఇది లాభసాటి

... మిగతా 6వ పేజీలో

ముదపాకలో ల్యాండ్ పూలింగ్ అక్రమాలపై విజిలెన్స్

- వివరాలు 6లో



అప్పన్నకు వైభవంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం,నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా ఆదివారం స్వర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి పసిడి సంపెంగలను తీసి భక్తులతో స్పృశింపజేసి బేడా మండప ప్రదక్షిణ చేశారు. అనంతరం భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. నారసింహ అష్టోత్తర శతనామార్చన చేసి అన్ని నామాలకు పసిడి సంపెంగలతో పూజలు జరిపారు. తరువాత అదే వేదికపై ఆర్జిత నిత్య కల్యాణం నిర్వహించారు. స్వామివారికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేష వస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

సింహగిరి క్షేత్ర పాలకుడికి ప్రత్యేక పూజలు



సింహాచలం, నవంబరు 24 : సింహగిరి క్షేత్రపాలకుడు బల త్రిపురాంతకస్వామికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ పురోహితులు పవిత్ర గంగధార నుంచి జలాలను తీసుకు రాగా ధర్మకర్తలు లోక కల్యాణార్థం అనే సంకల్పంతో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, పంచామృతాభిషేకాలు చేసిన తరువాత ప్రత్యేకంగా తీసుకువచ్చిన వట్టివేళ్లతో పూజలు చేశారు. అనంతరం నెలంతా స్వామివారిని దర్శించుకున్న భక్తుల సహకారంతో అన్నప్రసాద వితరణ జరిపారు.

300 మందికి వైద్య పరీక్షలు

ఆనందపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గండిగుండం గ్రామంలో ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 300 మందికి వైద్యులు పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకుడు లోగిశ గణేశ్ మాట్లాడుతూ సేవా భావంతో ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం ప్రతినిధులు పచ్చిపులుసు కనకారావు, సుధాకరరెడ్డి, కడగల నారాయణరావు, గవర సోంబాబు, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన శాస్త్రీయ నృత్యాలు



మధురవాడ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : శిల్పారామంలో వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం నగరానికి చెందిన జోష్ అకాడమీ కళాకారులు శాస్త్రీయ, జానపద నృత్యాలు ప్రదర్శించారు. పలు గీతాలకు కళాకారులు మోహనలక్ష్మీ, కుశల్, మౌనిక, సంజన, చిన్నారి, ఆశాలత, మన్మిత, గామిని, దివ్య, బిందు తదితరులు నృత్య రీతులు సమకూర్చారు.

బీజేపీ విజయోత్సవ సంబరాలు

పద్మనాభం రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ గెలుపొందడంతో స్థానిక నాయకులు, కార్యకర్తలు పద్మనాభంలో ఆదివారం విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. భారీ కేక్ కట్ చేసి, స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఉప్పాడ అప్పారావు, రెడ్డిపల్లి శ్రీనివాసరావు, ప్రకాశ్, అప్పారావు పాల్గొన్నారు.

తీర ప్రాంతాల్లో పర్యాటకుల సందడి



సందర్శకులతో కిటకిటలాడుతున్న రుషికొండ బీచ్

సాగర్‌నగర్/భీమునిపట్నం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : భీమిలి, రుషికొండ, సాగర్‌నగర్, కైలాసగిరి ప్రాంతాలు సందర్శకులతో ఆదివారం కిటకిటలాడాయి. పిక్నిక్ సీజన్ కావడంతో నగరవాసులతో పాటు విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి వేలాది మంది పర్యాటకులు తరలివచ్చారు. దీంతో అన్ని సందర్శనీయ స్థలాలు జనంతో కళకళలాడాయి. చాలామంది కైలాసగిరిపై వన భోజనాలు చేసి, అక్కడ నుంచి బీచ్‌లకు వచ్చారు.తెన్నేటి పార్కు వద్ద ఉన్న బీచ్, సీతకొండ వ్యూపాయింట్, సాగర్‌నగర్, రుషికొండ, భీమిలి తీర ప్రాంతాలు సందర్శకులతో సందడిగా మారాయి. రుషికొండ బీచ్‌లో కొందరు సముద్ర స్నానాలు చేయగా, మరికొందరు బోటు షికార్ చేశారు. ఇక్కడ పలుమార్లు పార్కింగ్ సమస్య తలెత్తింది. పలువురు వాహనాలను పార్కింగ్ చేసుకునేందుకు ఇబ్బంది పడ్డారు. అలాగే బీచ్ రోడ్డులో విపరీతమైన వాహనాల రద్దీ కనిపించింది. భీమిలి బీచ్‌రోడ్‌లో కూడా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే గంటా హామీ

భీమునిపట్నం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హామీ ఇచ్చారని మత్స్యకార పెద్దలు తెలిపారు. ఆదివారం పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. భీమిలి నుంచి విశాఖ వరకూ తీర ప్రాంతంలో మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలపై పది రోజులుగా జిల్లా మత్స్యకారుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో రిలే దీక్షలు నిర్వహించామన్నారు. మత్స్యకారుల శ్మశానాలను సైతం ఆక్రమించి తీరంలో రెస్టారెంట్లు నిర్వహిస్తున్నారని, దీని వల్ల మానసికంగా ఇబ్బంది పడుతున్నామని చెప్పారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే గంటా దృష్టికి తీసుకువెళ్లగా వారం రోజుల్లో అధికారుల నుంచి నివేదికలు తీసుకుని తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. ఎమ్మెల్యే హామీపై పూర్తి విశ్వాసంతో రిలే దీక్షలు విరమించామన్నారు. ఈ సమావేశంలో నాయకులు గంటా నూకరాజు, వాసుపల్లి కొండబాబు, వాసుపల్లి గరగయ్య, కారి చిన్నారావు, పుక్కళ్ళ ఎల్లారావు, నక్కా రవి, దూడ రాజు, గంటా ఎల్లాజీరావు, పుక్కళ్ల అమ్మోరు పాల్గొన్నారు.

బస్ షెల్టర్లు నిర్మించాలి : సీపీఐ

తగరపువలస, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : బస్ షెల్టర్లు నిర్మించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ నాయకులు ఆదివా రం తగరపువలస కూడలిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకుడు కానూరి రాంబాబు మాట్లా డుతూ తగరపువలస కూడలిలో విశాఖ, విజయనగరం, భీమిలి ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదారులు కలవడం వల్ల అయిదు మండలాలకు చెందిన ప్రజలు నిత్యం ఇక్కడికి వస్తుంటారని చెప్పారు. బస్ షెల్టర్లు లేకపోవడంతో వారంతా దుకాణాల వద్ద, చెట్ల కింద ఉంటున్నారని తెలిపారు. ఈ మూడు రూట్లలో మూడు బస్ షెల్టర్లు నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు మోర అప్పలరాజు, గోవిందరావు, చిన్నారావు లక్ష్మణరావు, వీర్రాజు పాల్గొన్నారు.



యువత నుంచి అంగీకర పత్రాలు స్వీకరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

అవయవదానంపై అవగాహన

భీమునిపట్నం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మరణించినా జీవించే అవకాశం ఒక్క అవయవ దానంతోనే కలుగుతుందని అఖిల భారత శరీర అవయవ దాతల సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు గూడూరు సీతామహాలక్ష్మి అన్నారు. ఆదివారం ది సన్ స్కూల్ ఆవరణలో భీమిలి నీడీ వెల్ఫేర్, లయన్స్ క్లబ్ ఆఫ్ భీమిలి గ్రేటర్ సంయుక్త ఆధ్వర్యంలో అవయవ దానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మరణించినా.. జీవించండి అన్న నినాదంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తుందన్నారు. అనంతరం ది సన్ స్కూల్ డైరెక్టర్ కైతపల్లి శ్రీనివాసరావు, తగరపువలసకు చెందిన దుర్గా కోటి, శేఖర్, గోపి కుటుంబాలతో పాటు 102 మంది అవ

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన బోధన



విద్యార్థులతో క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ వెంకటేశ్వరరావు, సభ్యులు

సాగర్‌నగర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ వైజాగ్ కపుల్స్ దాతృత్వాన్ని చాటుకుంది. క్లబ్ సభ్యులు సాగర్‌నగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఆరు టాయిలెట్స్ నిర్మించారు. వీటిని రోటరీ క్లబ్ వైజాగ్ కపుల్స్ డిస్ట్రిక్ గవర్నర్ ఆర్‌టీఎన్ ఎం. వెంకటేశ్వరరావు ఆదివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు మౌలిక సదుపాయాలు ఎక్కువగా ఉంటాయన్నారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మరుగుదొడ్ల లేకపోవడంతో రూ.1.2 లక్షలతో ఆరు టాయిలెట్స్ నిర్మించామని తెలిపారు. అనంతరం క్లబ్ సభ్యులు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ వైజాగ్ కపుల్స్ అధ్యక్షుడు ధర్మేంద్ర వారాడ, సెక్రటరీ శ్రావణి చిట్టూరి, తదితరులు పాల్గొన్నారు.

ముదపాక ల్యాండ్‌పూలింగ్ అక్రమాలపై విజిలెన్స్

పెందుర్తి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముదపాకలో ప్రభుత్వ గృహ నిర్మాణాల కోసం చేపట్టిన భూ సమీకరణ ఆది నుంచీ వివాదాస్పదమవుతోంది. దీనిపై తాజాగా విజిలెన్స్ దృష్టి సారించింది. భూ సమీకరణలో ఇన్‌సైడ్ ట్రేడింగ్ జరిగిందని, అప్పటి వైసీపీ ప్రభుత్వంలో బినామీలతో భూ దందా చేశారని రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో శనివారం పెందుర్తి తహసీల్దార్ కార్యాలయంలో విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రీజనల్ అధికారి శ్రీనివాసుల బృందం తహసీల్దార్ ఆనంద్‌కుమార్ నుంచి వివరాలు సేకరించింది. ఎంతమొత్తంలో ల్యాండ్ పూలింగ్ జరిగింది, జగనన్న కాలనీకి ఎంత కేటాయించారు, రైతులకు అందిన పరిహారం, తదితర దస్త్రాలను పరిశీలించారు.

ఇదీ వివాదం

ముదపాకలో జగన్నకాలనీకు భూములిచ్చిన రైతులకు పరిహారం కింద పట్టాలు, ఎల్‌పీసీలు ఇవ్వలేదు. దీంతో రైతులు కోర్టును ఆశ్రయించి స్టేటస్ కో తెచ్చుకున్నారు.కాగా జగనన్న కాలనీలో విధులకు విఘాతం కలిగిస్తున్నారంటూ ఇటీవల తొమ్మిదిమంది రైతులపై తహసీల్దార్ ఫిర్యాదు నేపథ్యంలో పోలీసులు కేసు నమోదు చేశారు. కోర్టు స్టేటస్ కో ఇచ్చిందని పేర్కొంటూ సుమారు 50 ఎకరాల భూముల్లో రైతులు హెచ్చరిక బోర్డులు పెట్టగా, ఇవే భూములను ల్యాండ్‌పూలింగ్‌లో సేకరించామంటూ వాటిని తొలిగించి, రెవెన్యూ సిబ్బంది హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అయితే ల్యాండ్ పూలింగ్‌లో 130 మంది రైతుల నుంచి 400 ఎకరాలు సేకరించగా, డీ పట్టా పట్టాదారులకు ఎకరాకు 900 గజాలు, ఆక్రమణదారులకు 450 గజాల చొప్పున ఇవ్వాలని గత ప్రభుత్వం నిర్ణయించి ఎల్‌పీసీ జారీచేసింది. కొంతమందికి ఎల్‌పీసీలు ఇచ్చి మరికొంత మందిని విస్మరించడంతో వివాదానికి బీజం పడింది. రైతులకు పరిహారంగా ఇచ్చే భూములను చూపకపోవడంతో కొంతమంది హైకోర్టును ఆశ్రయించారు. ఇలా సుమారు 95 మంది పోరాడుతున్నారు. వైసీపీ నేతల సూచనలతో రెవెన్యూ అధికారులు జగన్నాటకానికి తెర తీశారనే ఆరోపణలున్నాయి. బినామీలకు రిజిస్ట్రేషన్లు చేశారని, లబ్ధిదారుల పేర్లు మాయమయ్యాయని ఫిర్యాదులు అందడంతో విజిలెన్స్ తనిఖీలు జరిగాయి.



స్వామివారి సన్నిధిలో ప్రిన్సెస్ డా. అశ్వతి తిరునాళ్ గౌరీ లక్ష్మీబాయి, తదితరులు

సింహాద్రినాథుడ్ని దర్శించుకున్న ప్రముఖులు

సింహాచలం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామిని ట్రావెన్‌కోర్ సంస్థానాధీశులు, కేరళలోని అనంత పద్మనాభస్వామి దేవాలయ ట్రస్టీ ప్రిన్సెస్ డా. అశ్విత తిరునాళ్ గౌరీ లక్ష్మీబాయి, ప్రముఖ గాయకుడు గజల్ శ్రీనివాస్ ఆదివారం రాత్రి దర్శించుకున్నారు. వారికి దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న వారి గోత్ర నామా లతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేశారు. గోదాదేవి సన్నిధిలో కుంకుమ పూజలు తరువాత ఆలయ పండితులు వేదాశీర్వనాలీయగా అధికారులు స్వామివారి ప్రసాదాలు అందజేశారు.

ఘనంగా ఎన్‌సీసీ వ్యవస్థాపక దినోత్సవం



మాక్ షూటింగ్‌ను తిలకిస్తున్న వీసీ గౌతమ్‌రావు

సాగర్‌నగర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : గీతం యూనివర్సిటీలో ఆదివారం ఎన్‌సీసీ డే ఘనంగా నిర్వహించారు. గీతం క్రీడా విభాగం, ఎన్‌సీసీ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు వీసీ ప్రొఫెసర్ వై. గౌతమ్‌రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతలో జాతీయతా భావాన్ని పెంపొందింపజేయడంలో ఎన్‌సీసీ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఎన్‌సీసీ కేడెట్లు తోటి విద్యార్థుల్లో వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దడంతో పాటు మంచి ప్రవర్తనతో మెలిగేలా చూడాలన్నారు. అనంతరం వర్సిటీ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో గీతం క్రీడా విభాగం డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్, గీతం విద్యార్థి విభాగం డైరెక్టర్ బాలాకుమార్, వివిధ విభాగాల అధిపతులు, పాల్గొన్నారు.

పుష్కరిణిలో కార్తీక దీపారాధన

సింహాచలం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : విశ్వహిందూ పరిషత్ గోపాలపట్నం ప్రఖండ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం వరాహ పుష్కరిణి వద్ద కార్తీక దీపారాధన వైభవంగా నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన వందలాది మంది భక్తులు పాల్గొనగా వీహెచ్‌పీ నేతలు తొలుత శివ పార్వతులకు ప్రత్యేక పూజలు చేశారు. తరువాత భక్తులకు ప్రమిదలు, వత్తులు, నూనెలు ఉచితంగా అందజేయగా వాటితో పలువురు దీపారాధన చేశారు. కొందరు పుష్కరిణి లో దీపాలు వదిలారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మీసాల రవీంద్ర, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గ్రావెల్ అక్రమంగా తవ్విన వారికి జరిమానా

ఆనందపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : శొంఠ్యాం పంచాయతీలో గ్రావెల్ అక్రమంగా తవ్విన వారికి గనుల శాఖాధికారులు భారీగా జరిమానా విధించారు. పంచాయతీ పరిధిలో సర్వే నెంబరు 123, 347లో అను మతి లేకుండా కొందరు వ్యక్తులు అక్రమంగా గ్రావెల్ తరలించి, అమ్ముకున్నారని అధికారులకు ఫిర్యాదు అందింది. ఈమేరకు గనుల శాఖ రాయల్టీ ఇన్‌స్పెక్టర్, జిల్లా నిఘా విభాగం రాయల్టీ ఇన్‌స్పెక్టర్, వీఆర్‌ఓ, సర్వేయర్లు విచారణ జరిపి 63, 495 క్యూబిక్ మీటర్ల గ్రావెల్ తరలించినట్టు నిర్ధారించారు. గ్రావెల్ తవ్వకాలు జరిపిన వారికి రూ. 2.09 కోట్ల జరిమనా విధించారు.

తేనెటీగల దాడితో భక్తుల పరుగు

సింహాచలం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి ప్రధాన రాజగోపురం వద్ద తేనె టీగలు దాడి చేయడంతో భక్తులు పరుగులు తీశారు. ప్రధాన రాజగోపురం వద్ద తేనె పట్టు ఉంది. ఆదివారం మధ్యాహ్నం భక్తులు ఎక్కువగా తిరుగాడే సమయంలో ఒక్కసారిగా తేనె టీగలు చెల్లాచెదురయ్యాయి. దీంతో అటుగా రాకపోకలు సాగిస్తున్న భక్తులు భయాందోళనకు గురయ్యారు. భయంతో పరుగులు తీశారు.



తేనె టీగలను తప్పించుకుని వెళ్తున్న భక్తులు



రాజగోపురంలో తేనెపట్టు,

ప్రధాని సభకు భారీ ఏర్పాట్లు

... 5వ పేజీ తరువాయి

తెరపైకి తీసుకువచ్చారు. దీంతో పాటు విశాఖ ఉక్కు కర్మాగారం పునరుజ్జీవం కోసం ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించాలని కూడా కోరుతున్నారు.

ఏర్పాట్లపై కలెక్టర్ సమావేశం

ఇదిలావుండగా ప్రధానమంత్రి పర్యటన ఏర్పాట్లపై ఆదివారం కలెక్టరేట్‌లో అధికారులు, ప్రజాప్రతినిధులతో కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ సమావేశం నిర్వహించారు. ప్రధానమంత్రి పర్యటనలో రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి పాల్గొంటారని, వారికి బస ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. గవర్నర్ నోవాటెల్‌లో, సీఎం పోర్టు గెస్టు హౌస్‌లో ఉండేందుకు ప్రాథమికంగా చర్యలు తీసుకున్నామన్నారు. ఈనెల 29వ తేదీ సాయంత్రం ప్రధాని ఐఎన్ఎస్ డేగాకు చేరుకుని, అక్కడి నుంచి రోడ్డు మార్గం లేదా హెలికాప్టర్‌లో ఏయూకు చేరుకునే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. పలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసిన అనంతరం ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారన్నారు. రోడ్డు మార్గంలో వస్తే ఐకాన్ జంక్షన్ నుంచి ఎస్పీ బంగ్లా వరకు రోడ్‌షో ఉంటుందన్నారు. ప్రధాని పర్యటనకు సంబంధించిన పూర్తివివరాలు రావాల్సి ఉందన్నారు. ఈ సమావేశంలో విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, ప్రభుత్వ విప్ పి.గణబాబు, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, పి.విష్ణుకుమార్‌రాజు, పంచకర్ల రమేశ్‌బాబు, నగర సీపీ శంఖబ్రాత బాగ్చీ, డీసీపీ అజిత వేజెండ్ల, మేరీ ప్రశాంతి, జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్, జేసీ మయూర్ అశోక్, డీఆర్వో బీహెచ్ భవానిశంకర్, ఆర్డీవోలు శ్రీలేఖ, సంగీత్‌మాధుర్ పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేపు ఐదుగురు మంత్రుల సమీక్ష

ప్రధానమంత్రి పర్యటన విజయవంతం చేయడానికి ఈనెల 26వ తేదీన విశాఖపట్నం కలెక్టరేట్‌లో ఐదుగురు రాష్ట్ర మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీక్ష నిర్వహిస్తారు. ప్రధాని పర్యటనకు సంబంధించి తీసుకోనున్న చర్యలు, చేపట్టనున్న ఏర్పాట్లపై వీరు సమీక్షించనున్నారు.

చర్యలపై మీనమేషాలు!

... 5వ పేజీ తరువాయి

నిర్మాణం చేపట్టారని, రెండు వేర్వేరు భవనాలను నిర్మించాల్సి ఉండగా, ఒకే భవనం నిర్మించారని గుర్తించారు. ఈ నేపథ్యంలో భవనంపై ఎందుకుచర్యలు తీసుకోకూడదో చెప్పాలంటూ కార్పొరేటర్‌కు షోకాజ్ నోటీసు జారీచేశారు. ఈ స్థలంపై హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్నందున తుదితీర్పుకు లోబడి చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని భవన యజమానికి స్పష్టంచేశారు.

అయితే ఆ భవనంపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా వైసీపీకి చెందిన ఒక కార్పొరేటర్ భర్త, జీవీఎంసీలో స్టాండింగ్ కౌన్సిల్‌గా పనిచేస్తున్న న్యాయవాది రంగంలోకి దిగారు. భవన నిర్మాణ సమయంలో కూడా వీరు చక్రం తిప్పారనే ఆరోపణలున్నాయి. ఈ స్థలం ప్రభుత్వానికి చెందినదంటూ కొందరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయడంతో జీవీఎంసీ అధికారులు ప్లాన్ జారీచేయడానికి వెనుకాడారు. అయినప్పటికీ న్యాయపరంగా ఉన్న చిక్కులను ఆ న్యాయవాది తన తెలివితేటలతో పరిష్కరించారని, ఆపై వైసీపీకి చెందిన కీలక నేతలతో రెవెన్యూ, జీవీఎంసీ అధికారులపై ఒత్తిడి తెచ్చి నిర్మాణానికి లైన్ క్లియర్ చేశారని ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో తాజాగా అక్రమభవనం విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' తిరిగి వెలుగులోకి తేవడంతో జీవీఎంసీ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. దీంతో అప్రమత్తమైన సదరు భవన యజమాని గతంలో తనకు సహకరించిన జీవీఎంసీ స్టాండింగ్ కౌన్సిల్‌ను సంప్రదించినట్టు సమాచారం. దీంతో న్యాయవాది తన పలుకుబడి, తెలివితేటలను ఉపయోగించడంతోపాటు భవన యజమాని ద్వారా కొందరికి డబ్బులు ఇప్పించి చర్యలు లేకుండా కాపాడేందుకు యత్నిస్తున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలోనే జీవీఎంసీ అధికారులు నోటీసు ఇచ్చిన తర్వాత చర్యలకు వెనుకాడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జీవీఎంసీకి నష్టం కలిగించే వ్యక్తిని స్టాండింగ్ కౌన్సిల్‌లో సభ్యుడిగా కొనసాగించడంపై ఇప్పటికైనా ఆలోచించాలని నగరవాసులు కోరుతున్నారు.

మహా అక్రమం

... 5వ పేజీ తరువాయి

చెల్లింపు జరిగింది. ఆతర్వాత పనులు పూర్తిచేసిన వారి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. జీవీఎంసీ ఖాతాలో కొంత నిధులు జమ కాగానే సీరియల్ నంబరు ఆధారంగా ముందుగా పనిపూర్తిచేసిన కాంట్రాక్టర్లకు వరుస క్రమంలో బిల్లులు చెల్లించాలనేది నిబంధన. ఇదిలావుండగా ఫిబ్రవరి 18 తర్వాత పనులు పూర్తిచేసిన కాంట్రాక్టర్లను పక్కనపెట్టి ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో పనులు చేసిన కాంట్రాక్టర్లకు ఇటీవల భారీగా బిల్లుల చెల్లింపు చేపట్టడం వివాదానికి దారితీసింది. తొమ్మిది నెలల కిందట పనులు పూర్తిచేసి బిల్లు కోసం ఎదురుచూస్తుంటే ఇటీవల చేసినవారికి ఎలా చెల్లించారంటూ కొందరు బహిరంగంగానే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చక్రం తిప్పిన కాంటాక్టర్ల సంఘం నేతలు

కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులో అధికారులు పరిగణనలోకి తీసుకోవాల్సిన వర్క్ సీనియారిటీ జాబితాను పక్కనపెట్టి, ఇటీవల పనులు పూర్తిచేసిన వారికి బిల్లుల చెల్లింపులో కాంట్రాక్టర్ల సంఘంలోని కొందరు నేతలే చక్రం తిప్పారని చెబుతున్నారు.త్వరగా బిల్లులు వచ్చేలా చూడాలంటూ జీవీఎంసీలో చెల్లింపు వ్యవహారాలను చూసే ద్వితీయశ్రేణి అధికారిని కలిశారు. ఇం దుకోసం ఐదు శాతం కమీషన్ ఇస్తామని ప్రతిపాదించారు. తాను ఏమీ చేయలేనని, ఏదో ఒక కారణం చూపించి కమిషనర్‌కు విన్నవించాలని అతడు సూచించారు. ఈ నేపథ్యంలో కుటుంబసభ్యులకు తీవ్ర అనారోగ్యమని, వైద్యం చేయించడానికి డబ్బుల్లేవని కొందరు, పిల్లలను ఉన్నతవిద్యకు విదేశాలకు పంపాలని మరికొందరు, పిల్లలకు పెళ్లి చేయాల్సి ఉందని ఇంకొందరు తప్పుడు కారణాలతో కమిషనర్‌ను తప్పుదారి పట్టించారని చెబుతున్నారు. దీంతో పరిశీలించాలని బిల్లులు చెల్లింపు వ్యవహారాలను చూసే అధికారికి కమిషనర్ సూచించారు. ఆ అవకాశం కోసమే ఎదురుచూస్తున్న ఆ అధికారి ఒక్కో కాంట్రాక్టర్ నుంచి ఐదు శాతం కమీషన్ వసూ లు చేశారని, కాంట్రాక్టర్ల సంఘం పేరుతో ఒక శాతాన్ని తీసుకుని పనిచేసి పెట్టారని తెలిసింది.

ఇవీ ఉదాహరణలు

బీచ్‌రోడ్డులోని ఓ పార్కులో పనులను ఆగస్టు లో పూర్తిచేసిన యూనియన్ నేతకు అధికారులు రెండు బిల్లులను చెల్లించేశారు. గతంలో కాంట్రాక్టర్ల సంఘంలో కీలకంగా పనిచేసి, ప్రస్తుతం వైసీపీలో కీలకనేతగా ఉన్న కాంట్రాక్టర్ ఒకరు తన కుమారుడి ద్వారా బినామీపేరుతో మూడు పనులు సెప్టెంబరులో పూర్తిచేస్తే, వాటికి బిల్లుల చెల్లింపులు జరిగిపోయాయి. ఇలా యూనియన్‌లో కొందరు కాంట్రాక్టర్లతోపాటు ఇతర కాం ట్రాక్టర్లు ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో చేసిన పనులకు బిల్లులు తీసుకున్నారు. తాము పనులు చేసి తొమ్మిది నెలలు గడుస్తున్నా బిల్లులు కాలే దని, కానీ రెండు నెలల కిందట పనులుచేసినవారికి బిల్లులు ఎలా చెల్లిస్తారని మిగిలిన కాంట్రాక్టర్లు ప్రశ్నిస్తున్నారు.

అఖండ నారాయణ నామ సంకీర్తన

సింహాచలం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి ప్రధాన రాజగోపురం పక్కన కళావేదికలో ఆదివారం అఖండ నారాయణ నామ సంకీర్తన చేశారు. కూర్మనపాలెం ప్రాంతానికి చెందిన నారాయణ భక్త బృందం నిర్విరామంగా నారాయణ నామంతో పలు కీర్తనలతో భజన చేశారు.

బెంబేలెత్తిస్తున్న గ్రామసింహాలు

... 5వ పేజీ తరువాయి

పరిణమిస్తోంది. వృద్ధులు, చిన్నారులు కుక్కల బారిన పడి ప్రాణాలు పోగొట్టుకుంటున్న పరిస్థితులు ఎదురవుతున్నాయి. ప్రతి సోమవారం జోనల్ కార్యాలయంలో నిర్వహించే పీజీఆర్ఎస్‌లో అధికశాతం ఫిర్యాదులు కేవలం కుక్కలు, పందులు నియంత్రణపైనే అందుతున్నా అధికారులు స్పందించడం లేదు. గాజువాక పారిశ్రామిక ప్రాంతంలో కుక్కలు దాడి చేసిన సంఘటనలు కోకొల్లలు. పెదగంట్యాడ ప్రాంతంలో గత ఏడాది ఒంటరిగా వెళ్తున్న ఓ మహిళపై కుక్కల గుంపు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడింది. ఇటీవల మంగళపాలెంలో కుక్కల దాడిలో ఓ మహిళ మృతిచెందింది. ఇలాంటి సంఘటనలు పారిశ్రామిక ప్రాంతంలో నిత్యం చోటుచేసుకుంటున్నాయి. తాజాగా అగనంపూడిలో ఇంటి ముందు ఆడుకుంటున్న చిన్నారిని రెండు వీధికుక్కలు తీవ్రంగా గాయపరిచాయి. అదే విధంగా గాజువాక డ్రైవర్స్ కాలనీలో పందులు దాడి చేయడం ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. కుక్కల దాడిలో గాయపడి గాజువాక ప్రభుత్వ ఆస్పత్రికి నిత్యం ఒకరిద్దరు వస్తున్నారు. కుక్కలను నియంత్రించాలని స్థానికులు ఫిర్యాదులు చేస్తేనే అధికారులు స్పందిస్తున్నారనే విమర్శలున్నాయి. అది కూడా కుక్కలు పట్టేందుకు వ్యాన్ పంపుతున్నారని, ఆ సిబ్బంది నామమాత్రంగా నాలుగైదు కుక్కలు పట్టుకొని కొంతదూరం వెళ్లిన తరువాత, వాటిని విడిచిపెడుతున్నారని ఆరోపిస్తున్నారు. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించకపోతే భవిష్యత్తులో మరిన్ని దారుణాలు జరుగుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రైతుబజార్లలో స్టాళ్లకు డిమాండ్

... 5వ పేజీ తరువాయి

వ్యవహారంగా మారిందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. తాజాగా ఈ నెల 6న జిల్లాలోని 11 రైతుబజార్లలో 37 స్టాళ్లను అద్దె ప్రాతిపదికన కేటాయించడానికి వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ప్రకటన జారీ చేసింది. ఇందులో డ్వాక్రా సంఘాలకు 29 స్టాళ్లు, మరో ఏడు దివ్యాంగులకు కేటాయించారు. డ్వాక్రా సంఘాలు కూరగాయలు పండించాల్సిన అవసరం లేదు. డిమాండ్ ఉన్న సరకులు కొనుగోలు చేసి తెచ్చి ఇక్కడ అమ్ముకోవచ్చు. నెలకు స్టాల్‌కు రూ.9వేలు అద్దె చెల్లించాలి. దివ్యాంగులైతే వారే స్టాల్ నడుపుకోవాలి. మరొకరి సాయం తీసుకోకూడదు. కుటుంబసభ్యుల సాయం తీసుకుంటున్నారని కొన్నిచోట్ల వారి కేటాయింపులు రద్దు చేశారు. దాంతో స్టాళ్లు ఖాళీ అయ్యాయి. డ్వాక్రా స్టాళ్లకు ఆశించిన దాని కంటే ఎక్కువ దరఖాస్తులు వచ్చాయి. వారు నిజంగా డ్వాక్రా గ్రూపుల్లో సభ్యులా ? కాదా? అని ప్రస్తుతం క్షేత్ర పరిశీలన చేస్తున్నారు. అయితే ఇవన్నీ పేరుకే. సిఫారసులకే పెద్దపీట వేస్తున్నారని బహిరంగంగానే విమర్శలు వినిపిస్తున్నాయి.

చిట్టివలసలో స్పందన శూన్యం

చిట్టివలసలో కొత్తగా రైతుబజారు ఏర్పాటుచేశారు. ఇంకా ప్రారంభించలేదు. ప్రస్తుతం పట్టణంలో ప్రధాన రహదారికి ఇరువైపులా కూరగాయల వ్యాపారాలు జరుగుతున్నాయి. జనం బాగానే వస్తున్నారు. కొత్త రైతుబజారు జాతీయ రహదారికి దగ్గరగా పెట్టారు. అక్కడికి జనం వస్తారో.. రారో అని అనుమానాలున్నాయి. అక్కడ ఐదు దుకాణాలను అద్దెకు ఇస్తామని వ్యవసాయ మార్కెటింగ్ శాఖాధికారులు ఈ నెల 6న ప్రకటన ఇచ్చారు. ఒక్కో దుకాణానికి దరఖాస్తుతో పాటు రూ.30వేలు డిపాజిట్ చెల్లించాలని నిర్దేశించారు. అయితే ఇప్పటివరకు ఇలా డిపాజిట్ కోరలేదు. కాగా ఇక్కడ స్టాళ్లకు ఒక్కరు కూడా ముందుకు రాలేదు. ఈ నెల 12న గడువు ముగిసిపోయింది. మళ్లీ నోటిఫికేషన్ ఇచ్చారు. ఈ స్టాళ్లను ఏమి చేస్తారో వేచి చూడాలి. స్టాళ్ల కేటాయింపుపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందంటున్నారు.


శుభ్రం చేస్తున్న జీవీఎంసీ సిబ్బంది

పొంగి పొర్లిన యూజీడీ

వెంకోజీపాలెం,నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 15వ వార్డు సింహాద్రిపురం కొండవాలు ప్రాంతంలో ఆదివారం ఉదయం అం డర్ గ్రౌండ్ డ్రైనేజీ మ్యాన్‌హోల్ పొంగి మురుగు నీరంతా రోడ్లపై పారింది. వార్డు టీడీపీ అధ్యక్షుడు బుగత సత్యనారాయణ వెంటనే స్పందించి యూజీడీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో వారు వచ్చి సమస్యను పరిష్కరించారు. తమ ప్రాంతంలో ఎప్పటికప్పుడు ఈ సమస్య పునరావృతమవుతుందని, శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

ముగిసిన సత్యసాయి జయంత్యుత్సవాలు

ఎంవీపీ కాలనీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీలోని సత్యసాయి ప్రేమ సదన్‌లో కొద్ది రోజులుగా జరుగుతున్న భగవాన్ సత్యసాయి బాబా 99వ జయంత్యుత్సవాలు ఆదివారంతో ముగిసాయి.చివరి రోజు సత్యసాయి సేవా సంస్థలు, సత్యసాయి సేవా సమితి సంయుక్తంగా పలు కార్యక్రమాలు చేపట్టాయి. ఏకవారాభిషేకం, ఓంకారం, సుప్రభాతం, ప్రత్యేక భజనలు,సర్వమత ప్రార్థనలు, ఉయ్యాల సేవ, మహా మంగళహారతి వంటివి నిర్వహించారు.ఆసుపత్రుల్లోని రోగులకు, జైలులోని ఖైదీలకు,అనాధ ఆశ్రమాల్లోని వృద్ధులకు దుస్తులు, పండ్లు, నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు నాయుడు, సిటీ కన్వీనర్ రాజు, పతాధికారులు, సేవాదళ్, యువజన విభాగం ప్రతినిధులు పాల్గొన్నారు.

శివాజీపాలెంలో టీడీపీ సభ్యత్వ నమోదు

మద్దిలపాలెం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : శివాజీపాలెం పరిసర ప్రాంతాల్లో టీడీపీ నాయకులు ఆదివారం పార్టీ సభ్యత్వ నమోదు చేపట్టారు.బైరెడ్డి పోతన్నరెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి పార్టీలో చేరాలని కోరారు. ఆసక్తి కలిగిన వారితో దరఖాస్తు పూరించి సభ్యత్వం ఇచ్చారు. ఈకార్యక్రమంలో నాయకులు బొట్టా వెంకటరమణ, పీతల అఖిల్, కంబాపు శివారెడ్డి, ఒమ్మి అప్పారావు, బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

విశాఖపట్నం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవా రం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వ హించనున్నట్టు మేయర్ హరివెంకటకుమారి, కమిషనర్ సంపత్‌కుమార్ తెలిపారు. ఆదివా రం వారు ఒక ప్రకటన విడుదల చేశారు.

సినిమా గైడ్

● **కంగువా :** సంగం, జగదాంబ, మెలోడి, శ్రీరామ, కామేశ్వరి, కిన్నెర, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం) కన్య కాంప్లెక్స్ (గాజువాక)
● **మట్కా :** శరత్, శారద, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్-3 (గాజువాక)
● **అపుడో, ఇప్పుడో, ఎప్పుడో :** లిఖిత (శ్రీహరిపురం)
● **క :** జగదాంబ, సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), గణేష్ (తగరపువలస)
● **లక్కీ భాస్కర్:** శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా),సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), శ్రీరాములమ్మ (తగరపువలస)
● **అమరన్:** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్, నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
● **బఘీర :** వెంకటేశ్వర, శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ)
● **దేవర :** రమాదేవి, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 54, టమాటా 28, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 52, బెండకాయలు 18, పచ్చిమిర్చి 32, కాకరకాయల 40, బీరకాయలు 38, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 30, క్యారెట్ 64 దొండకాయలు 32, బంగాళదుంపలు 40, అరటికాయ (పెద్దది) 6, అల్లం (పాతది)50, మునక్కాడలు (కిలో) 74, బరబాటి 30, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 36, దోసకాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్(పెన్సిల్) 55, పొటల్స్ 52, కీరదోస 24, క్యాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 42, చిలగడదుంపల 32, కంద 66, దేముడు చిక్కుడు 82, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, క్యారపెండలం 45, మామిడి అల్లం 60, బొప్పాయి 40, బూడిద గుమ్మడికాయ 30, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	585
విజయనగరం	589
శ్రీకాకుళం	589

చికెన్ ధరలు
బ్యాగ్

రైతు ధర	110
ఫారం ధర	130
విత్ స్కిన్	230
స్కిన్‌లెస్	240

ముడసర్లోవ పార్కులో మామూళ్ల దందా

» టెంట్ వేస్తే రూ.2 వేల వరకు వసూలు
» పార్కు సిబ్బంది నిర్వాకం
» పిక్నిక్ నిర్వాహకుల జేబుకు చిల్లు
» సందర్శకుల అసంతృప్తి


ముడసర్లోవ పార్కులో పిక్నిక్‌కు వచ్చేవారు వేసుకొనే టెంట్

ఆరిలోవ, నవంబర్ 24 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం కదా సరదాగా ముడసర్లోవ పార్కుకు పిక్నిక్ వెళదాం అనుకుంటే జేబుకు చిల్లు పడుతోందని సందర్శకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆహ్లాదం కోసం వెళితే ఆనందం ఆవిరైపోతోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈపార్కుల్లో టెంట్ వేసుకోవాలనుకుంటే అనధికారికంగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ప్రవేశ టికెట్ ధర రూ. 10 ఉంది. దీనికి తోడు పిక్నిక్‌కు వెళ్లే వారు టెంట్ వేసుకోవాలంటే అదనంగా రూ.2 వేలు వరకూ చెల్లించాల్సి వస్తోందని అంటున్నారు. ఇందుకు అక్కడ ఉన్న సిబ్బంది స్థలాన్ని చూపిస్తున్నారని, ఆ స్థలాన్ని బట్టి రేటు నిర్ణయిస్తున్నారని సందర్శకులు ఆరోపిస్తున్నారు. దీనిపై ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక, లోపలకు వెళ్లిన తర్వాత తిరిగి బయటకు రాలేక వారు అడిగిన మొత్తాన్ని సమర్పించుకోవాల్సి వస్తోందని అంటున్నారు. ఈ తతంగమంతా గుట్టుగా, అనధికారికంగా సాగుతోందని తెలుస్తోంది. ఇలా తీసుకున్న డబ్బులకు ఎలాంటి రశీదు కూడా ఇవ్వడం లేదని సమాచారం. అయితే ఈ వ్యవహారం గురించి అధికారులు తెలిసినా పట్టించుకోవడం లేదా ? వారికే తెలిసే ఇది సాగుతోందా? అన్న సందేహాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు. ఆహ్లాదం కోసం పార్కుకు వస్తే ఈ వసూళ్ల బాధ ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై అక్కడ ఉన్న సిబ్బందిని అడగ్గా.. పార్కులో పిక్నిక్ చేసుకునే వారు టెంట్ వేస్తే జీవీఎంసీకి రూ.500 చలానా చెల్లించి రశీదు తీసుకోవాలని తెలిపారు. అంతకుమించి ఏమీ తీసుకోవడం లేదని చెబుతున్నారు.

ఘనంగా గౌరీ పరమేశ్వరుల ఉత్సవం

వెంకోజీపాలెం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కొత్త వెంకోజీపాలెంలోని గ్రామ సేవా సంఘం, పీల వారి ఆధ్వర్యంలో నిర్వహించిన గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు ఆదివారంతో ముగిసాయి. ముందుగా ఆ సంఘం అధ్యక్షుడు పీల కనకరాజుతో పాటు గ్రామస్థులు గౌరీ పరమేశ్వరుల విగ్రహాలను ఊరేగించారు. అనంతరం సముద్రంలో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం కార్యవర్గ సభ్యులతో పాటు పీల వారి కుటుంబీకులు, మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు. కాగా పాత వెంకోజీపాలెంలో సీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన గౌరీ పరమేశ్వరి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి వద్ద ఉంచిన చీరలను ఆదివారం వేలం వేశారు. అమ్మవారి వద్ద భక్తులు వదిలేసిన 15 చీరలను వేలం వేయగా భక్తులు పోటీ పడి పాడుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఆడారి పరదేశినాయుడు, ప్రధాన కార్యదర్శి యల్లపు నాగరాజు, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రేపటి నుంచి సంగీత కచేరీలు

మద్దిలపాలెం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కళాభారతి ఆడిటోరియంలో ఈనెల 26 నుంచి డిసెంబరు 1 వరకు విశాఖ మ్యూజిక్ అకాడమీ 55వ వార్షికోత్సవ సంగీత సభలు జరగనున్నట్టు అకాడమీ అధ్యక్షుడు రంగరాజన్ తెలిపారు. ఆదివారం ఆయన అకాడమీ నిర్వాహకులు శ్రీనివాస్, రాజారావు, కృష్ణారావుతో కలిసి ఆ సంస్థ కార్యాలయంలో సభల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా ఏటా అందిస్తున్న సంగీత కళా సాగర బిరుదును ఈఏడాది చెన్నైకు చెందిన ప్రఖ్యాత మార్దంగికులు కేవీ ప్రసాద్‌కు అందజేయనున్నట్టు చెప్పారు. అలాగే 26న పద్మావతి సారనాథన్ గాత్ర కచేరి, 27న మణిమారన్ గాత్ర కచేరి, 28న నాగరాజు, మైసూర్ మంజునాథ్ వాయులీనం, 29న సుధాకర్ గాత్ర కచేరి, 30న మండ సుధారాణి గాత్రకచేరి, 1న బాలచంద్రన్ వీణ కచేరి ఉంటుందన్నారు. నగర ప్రజలు ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ముగిసిన రీ నెక్స్ట్ ఎక్స్‌పో


సోలార్ విద్యుత్ ప్రదర్శనలో సందర్శకులు

మద్దిలపాలెం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఏయూ మైదానంలో ఆంధ్రప్రదేశ్ సోలార్ ఎనర్జీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రీనెక్స్ట్ పేరుతో నిర్వహిస్తున్న సోలార్ రెన్యూవబుల్ ఎనర్జీ ఎక్స్‌పో - 24 ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు హేమకుమార్ మాట్లాడుతూ ఏయూ మైదానంలో మూడు రోజుల పాటు నిర్వహించిన సౌర విద్యుత్ ప్రదర్శనలో 40 స్టాల్స్ ఏర్పాటు చేయగా నగర ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. వ్యాపారవేత్తలు, రాజకీయ ప్రముఖులు ప్రదర్శనను సందర్శించి, స్టాల్స్‌ను పరిశీలించారని చెప్పారు. సోలార్ ప్లాంటులకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సూర్య ఘర్ పథకాల లబ్ధి వివరాలను వినియోగదారులు తెలుసుకున్నారన్నారు. విశాఖలో విజయవంతమైన ఎక్స్‌పోతో రాష్ట్రవ్యాప్తంగా మరెన్నో ప్రదర్శనలు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామ్మోహనరావు, ఉపాధ్యక్షుడు నాగరాజు, కోశాధికారి జయబాబు, సంయుక్త కార్యదర్శి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

'రన్ ఫర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్' బ్రోచర్ ఆవిష్కరణ


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

వెంకోజీపాలెం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఆర్‌కే బీచ్‌లో ఈనెల 26న రాజ్యాంగం దినోత్సవం పురస్కరించుకుని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రన్ ఫర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈమేరకు ఏయూలోని జియోగ్రఫీ విభాగం వద్ద అసోసియేషన్ అధ్యక్షుడు ఆచార్య కోటిజాన్, ఏయూ సీడీసీడీన్ ఆచార్య టి.వి.కృష్ణ, వివిధ సంఘాల ప్రతినిధులు ఆదివారం బ్రోచర్ విడుదల చేశారు. అసోసియేషన్ కార్యదర్శి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఆరేటి మహేశ్, ఆచార్య సునీత, డాక్టర్ బి.మోహన్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎంవీపీ టీటీడీలో దీపోత్సవం

ఎంవీపీ కాలనీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : తిరుమల తిరుపతి దేవస్థానాలు, హిందూ ధర్మ పరిషత్ ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపంలో సోమవారం సాయంత్రం 5 నుంచి 8 వరకూ కార్తీక దీపోత్సవం నిర్వహించనున్నారు. ముందుగా వెంకటేశ్వరుని పంచలోహ విగ్రహాలకు పూజలు జరిపి, ,,సంప్రదాయ వైదిక ఆచారాలను అనుసరించి టీటీడీ అర్చకులు పూజలు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

సందడిగా దేవాంగుల కార్తీక సమారాధన

ఎంవీపీ కాలనీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వెంకోజీపాలెంలోని సీఎంఆర్ ఫంక్షన్ హాలులో ఆదివారం విశాఖ దేవాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తీక సమారాధన నిర్వహించారు. సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వాన ప్రస్థాన ఓల్డ్ ఏజ్ హోమ్ కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీనివాస్‌ను ఆ సంఘం ప్రతినిధులు సన్మానించారు. అనంతరం కల్యాణ వేదిక, విద్యార్థులకు ఉపకార వేతనాలు, మహిళలకు, పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించారు. 30 మంది కమిటీ సభ్యులకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు సాంబమూర్తి, సత్యనారాయణ, రాజారావు, సుదర్శన్, అప్పలరాజు, సత్యనారాయణమూర్తి, బాబూజీ, అరుణ, రాధిక పాల్గొన్నారు.

ముగిసిన పోలీసుల స్పోర్ట్స్ మీట్

వెంకోజీపాలెం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కైలాసగిరిలో ఉన్న జిల్లా పోలీస్ పెరేడ్ మైదానంలో మూడు రోజులుగా జరుగుతున్న పోలీసుల వార్షిక గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ ఆదివారం సాయంత్రంతో ముగిసింది. చివరి రోజు పోటీలకు విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జెట్టీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పురుషులకు నిర్వహించిన 100 మీటర్ల ఫైనల్ రన్నింగ్ పోటీలను డీఐజీ, అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సింహా ప్రారంభించారు. అనంతరం పోటీల్లో విజేతలకు డీఐజీ బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పోలీసు స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ పండుగ వాతావరణంలో ఉత్సాహంగా జరిగిందన్నారు. క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, ప్రతిరోజూ చురుగ్గా విధులు నిర్వర్తించేందుకు క్రీడలు ఎంత గానో దోహదపడతాయన్నారు.

బూసికి తన్నీరు కోటయ్య స్మారక జాతీయ సాహితీ ప్రతిభా పురస్కారం

వెంకోజీపాలెం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఏయూ తెలుగు ఆచార్యులు డాక్టర్ బూసి వెంకటస్వామికి తన్నీరు కోటయ్య స్మారక జాతీయ సాహితీ ప్రతిభా పురస్కారం లభించింది. ఆదివారం ఆయన ఒంగోలులోని ఎన్‌టీఆర్ కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో పురస్కారం అందుకున్నారు. ప్రముఖ సాహితీ సంస్థ మహతి వ్యవస్థాపక అధ్యక్షుడు మహతి తన్నీరు బాలాజీ ఆయన తండ్రి పేరు మీద ఏటా ఈ పురస్కారాన్ని అందిస్తున్నారు.

బేరియాట్రిక్ యూనిట్‌తో మెరుగైన ఫలితాలు



కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు

విశాఖపట్నం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : బేరియాట్రిక్ సర్జరీలను టీమ్‌గా ఏర్పడి చేయడం వల్ల మెరుగైన ఫలితాలు వస్తాయని మహాత్మాగాంధీ కేన్సర్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ వి.మురళీకృష్ణ అన్నారు. కేజీహెచ్ ఔట్ గేటు ఎదురుగా ఉన్న ఏ1 ల్యాప్రోస్కోపీ ఆస్పత్రిలో బేరియాట్రిక్స్ యూనిట్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంప్రెహెన్సివ్ యూనిట్ వల్ల మెరుగైన ఫలితాలు సాధ్యమవుతాయన్నారు. బేరియాట్రిక్ సర్జన్ డాక్టర్ ఏ. నవీన్‌కుమార్ మాట్లాడుతూ ఒబెసిటీ వల్ల శరీరంలోని అనేక అవయవాలు పాడవుతాయన్నారు.ఏటా ఒబెసిటీతో బాధపడుతూ రెండు లక్షల మంది మృత్యువాత పడుతున్నారని, అటువంటి సమస్యలకు చెక్ చెప్పడానికి బేరియాట్రిక్ సర్జరీ ఉపయోగపడుతుందని తెలిపారు. వివిధ విభాగాలకు చెందిన నిపుణులు ఉన్న సెంటర్లకు వెళ్లడం వల్ల ఫలితం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ సుబ్బరాజు, చీఫ్ అనస్థీషియాలజిస్ట్ డాక్టర్ ప్రవీణ్, ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ శైలజ, డైటీషియన్ త్రిషిత, గైనకాలజిస్ట్ డాక్టర్ ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.


జూ ప్రవేశద్వారం వద్ద సందర్శకులు

జంతు ప్రదర్శనశాల కిటకిట

ఆదివారం ఒక్కరోజే రూ.9,61,720 ఆదాయం

ఆరిలోవ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్తీక సమారాధనలకు విచ్చేసిన సందర్శకులతో ఆదివారం ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాల కిటకిటలాడింది. జిల్లానుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి సైతం సందర్శకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో తరలిరావడంతో జూ కళకళలాడింది. ఆదివారం ఒక్కరోజే 13,650 మంది జూకు రావడంతో రూ.9,61,720 ఆదాయం వచ్చినట్టు క్యూరేటర్ మంగమ్మ తెలిపారు. కాగా వాహనాల పార్కింగ్‌కు స్థలం లేకపోవడంతో అత్యధికులు రహదారి పక్కనే వాటిని నిలిపివేశారు. అలాగే కంబాలకొండకు సందర్శకుల తాకిడి పెరిగింది. సుమారు 1,500 మంది రావడంతో రూ.లక్షా 12 వేల ఆదాయం సమకూరినట్టు అధికారులు తెలిపారు. అత్యధికులు ఎంతో ఉత్సాహంగా బోటు షికార్ చేశారు. ముడసర్లోవ పార్కుకు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలతో పాటు కుల, ఉద్యోగ సంఘాలు విచ్చేసి ఆటపాటలతో ఆనందంగా గడిపారు.


తెల్లపులిని ఆసక్తిగా తిలకిస్తున్న సందర్శకులు

'ఉక్కు'పై మోదీ స్పష్టమైన ప్రకటన చేయాలి

» సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు
» కార్మిక వ్యతిరేక విధానాలకు ప్రభుత్వాలు విడనాడాలి
» గాజువాకలో భారీ కార్మిక ప్రదర్శన


పాత గాజువాకలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతున్న సీహెచ్ నరసింగరావు

గాజువాక, నవంబరు 24: విశాఖ పర్యటనకు విచ్చేస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిలిపివేస్తున్నట్టు స్పష్టమైన ప్రకటన చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిలిపివేయాలని, సెయిల్‌లో విలీనం చేయాలంటూ ఆదివారం పాత గాజువాకలో కార్మిక ప్రదర్శన చేపట్టారు. పాత గాజువాక నుంచి కొత్త గాజువాక వరకు, మళ్లీ అక్కడ నుంచి పాత గాజువాక వరకు ఈ ప్రదర్శన సాగింది. అనంతరం అక్కడ జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ అండతో దేశాన్ని కబళిస్తున్న కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా పోరాటాలను మరింత ఉధృతం చేయాలన్నారు. దేశ ప్రతిష్ఠను దెబ్బతీసిన అదానీపై ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలన్నారు.

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్లు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్‌లు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం కార్మికుల ఆర్థిక ప్రయోజనాలపై విధించిన ఆంక్షలను తక్షణమే విరమించుకోవాలన్నారు. దేశ సంపదను సృష్టిస్తున్న కార్మిక వర్గంపై దాడులు సరికాదన్నారు. విశాఖ విచ్చేస్తున్న ప్రధానికి స్టీల్‌ప్లాంట్ గురించి, ఇక్కడ నెలకొన్న పరిస్థితులను కూటమి నాయకులు వివరించాలని కోరారు. ప్లాంట్ పరిరక్షణ కోసం తాము ఎలాంటి పోరాటాలకైనా సిద్ధమన్నారు. కార్యక్రమంలో రాజకీయ నాయకులు పల్లా చిన్నతల్లి, మణి, రైతుసంఘం నాయకులు ఈశ్వర్, రెడ్డి వెంకటరావు, కుమార మంగళం, రాంబాబు, ఉక్కు పోరాట కమిటీ నేతలు కేఎస్ఎన్ రావు, జె.అయోధ్యరామ్, కేఎం శ్రీనివాస్, కారు రమణ, రామారావు, డీవీ రమణారెడ్డి, కరణం సత్యారావు, వరసాల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

విశాఖ వాసుల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్న కాలుష్యం

సీతంపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక కాలుష్యం విశాఖ ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుందని పర్యావరణ ప్రచారకర్త సోహన్ హటంగడి అన్నారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం జరిగిన మానవ హక్కుల వేదిక తొమ్మిదో మహాసభల్లో ఆయన పర్యావరణ విధ్వంసంపై మాట్లాడారు. పరిశ్రమల కాలుష్యం, సీవేజ్ వ్యర్థాలు, పోర్టు కాలుష్యం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వ్యర్థాలు విశాఖ కాలుష్యానికి ప్రధాన కారణాలుగా పేర్కొన్నారు. విశాఖ, గంగవరం పోర్టుల నుంచి వస్తున్న బొగ్గు, ధూళి చాలా ప్రాంతాలకు విస్తరించి కాలుష్యం బారిన ప్రజలను పడేస్తున్నాయన్నారు. ఉమ్మడి విశాఖ జిలాల్లో ప్రమాదకరమైన, అత్యంత ప్రమాదకరమైన జాబితాలో 386 పరిశ్రమలు ఉన్నట్టు కాగ్ నివేదికలో పేర్కొన్నట్టు ఆయన వెల్లడించారు. గత ఐదేళ్లలో ఇన్ని ప్రమాదకర పరిశ్రమలకు పీసీబీ 110 నోటీసులు మాత్రమే జారీ చేసిందన్నారు. గరిష్ఠంగా కాలుష్యాన్ని వెదజల్లే ఎన్‌టీపీసీ, హెచ్‌పీసీఎల్, స్టీల్ ప్లాంటులకు ఒక్క నోటీసు కూడా ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.శరత్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంటును ప్రైవేటుపరం చేసేందుకు కేంద్రం అన్ని విధాలా నిర్వీర్యం చేస్తుందని ఆరోపించారు. అనంతరం మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షురాలు కె.అనురాధ పారిశ్రామిక కాలుష్యంపై రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక రాష్ట్ర రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు హెల్మెట్లు పంపిణీ

సీతంపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు గాను జర్నలిస్టులకు ఉచితంగానే హెల్మెట్లు అందజేస్తున్నామని ఏపీ ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ చైర్మన్, ఉపకార్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ కంచర్ల అచ్యుతరావు అన్నారు. ఆదివారం పౌర గ్రంథాలయంలో ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఏపీ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్, ఏపీ స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ విశాఖ యూనిట్ల ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎవరికైనా హెల్మెట్ అందకపోతే తమ కార్యాలయానికి వచ్చి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలువురు జర్నలిస్టు సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బీచ్ రోడ్డులో గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



మహారాణిపేట, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): బీచ్ రోడ్డులో గుర్తు తెలియని ఓ వ్యక్తి ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బీచ్ రోడ్డులోని పోలీస్ మెస్‌కు సమీపంలో ఐరన్ గ్రిల్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని వద్ద సెల్ ఫోన్ ఉన్నప్పటికీ ఫార్మట్ చేయడంతో ఎలాంటి సమాచారం పోలీసులకు లభ్యం కాలేదు. దీంతో ఆయన ఎవరు, ఏ ప్రాంతానికి చెందిన వాడో ప్రస్తుతానికి తెలియరాలేదు. త్రీటౌన్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్ విగ్రహానికి పాలాభిషేకం

రామ్‌నగర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డిని వైసీపీ అవమానించిందని కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త దండి ప్రియాంక అన్నారు ఆదివారం బీచ్‌రోడ్డులోని వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి ఆమె పాలాభిషేకం చేసి నివాళులర్పించారు

అనంతరం ఆమె మాట్లాడుతూ వైఎస్ సీఎంగా ఉన్నప్పుడు ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ, 108, ఫీజు రియంబర్స్‌మెంట్, రైతుల రుణమాఫీ, ఉచిత విద్యుత్, వంటి పథకాలెన్నో ప్రజాదరణ పొందడంతో ఆయన అందరి గుండెల్లో ఉన్నారన్నారు. వైసీపీ తొలుత వైఎస్ ఫొటోను వినియోగించుకుని అధికారంలోకి వచ్చాక తొలగించిందన్నారు. వైఎస్ ఆత్మకు శాంతి కలగాలంటే వైసీపీలో ఉన్న రాజశేఖరరెడ్డి అభిమానులందరూ తిరిగి కాంగ్రెస్‌లోకి రావాలని ప్రియాంక కోరారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్ర మంలో నాయకులు గుర్రం కనకారావు, జగన్ మురారి, గాయత్రి, అసిరినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

గవర కార్పొరేషన్ డైరెక్టర్‌కు ఎమ్మెల్యే వెలగపూడి అభినందనలు

ఎంవీపీ కాలనీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీకి, ప్రభుత్వానికి మంచిపేరు తీసుకువచ్చేలా పనిచేయాలని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎన్నికైన మళ్ల రవికుమార్‌కు ఉద్బోధించారు. ఆదివారం రవికుమార్ ఎమ్మెల్యేను ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు వెలగపూడి అభినందనలు తెలిపారు. పార్టీ కోసం పనిచేసే వారికి టీడీపీలో గుర్తింపు లభిస్తుందనడానికి రవికుమారే నిదర్శనమన్నారు. పార్టీ కోసం పనిచేసే వారికి తప్పకుండా గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు.

ఘనంగా ఎన్‌సీసీ డే వేడుకలు

సీతంపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలలో 76వ ఎన్‌సీసీ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కమాండింగ్ అధికారి సర్జన్ కమాండర్ పాండా, ఏఎన్‌వోలు లెఫ్టినెంట్ లక్ష్మణబాబు, లెఫ్టినెంట్ రమా గోస్వామి, 130 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమాండింగ్ అధికారి సాయుధ దళాలలో ఉపాధి అవకాశాల గురించి, ఎన్‌సీసీ ప్రాముఖ్యతను వివరించారు.

విద్యార్థులను ఫీజుల కోసం ఇబ్బంది పెడితే చర్యలు

కలెక్టర్ హరేంధిర ప్రసాద్ హెచ్చరిక

విశాఖపట్నం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఫీజుల చెల్లింపు విషయంలో విద్యార్థులను ఇబ్బంది పెట్టవద్దని, ఇబ్బందులకు గురి చేసే విద్యాసంస్థలపై చర్యలు తీసుకుంటామని నిర్వాహకులను జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ హెచ్చరించారు. బకాయిల చెల్లింపు, ఇతర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ విధానపరమైన నిర్ణయం తీసుకుందన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయడానికి అన్ని ఏర్పాట్లను ప్రభుత్వం చేసిందన్నారు. ఫీజు చెల్లించలేదన్న కారణంతో యాజమాన్యాలు విద్యార్థులను తరగతులకు అనుమతించకపోవడం, హాల్ టికెట్లు జారీ చేయకపోవడం, పరీక్షలు రాయనీకుండా ఇబ్బందులకు గురి చేయడం వంటివి చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. సంబంధిత విద్యా సంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి విద్యార్థి పరీక్షలు రాయడానికి విద్యా సంస్థలు అవకాశం కల్పించాలన్నారు. విద్యా సంవత్సరం వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ నిబంధనలు ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్, కార్పొరేట్ తదితర అన్ని విద్యా సంస్థలకు వర్తిస్తాయని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలోని విద్యా సంబంధిత శాఖల అధికారులు ఈ విషయంలో జాగ్రత్త వహించాలన్నారు. పూర్తిస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు.

అండర్-14 క్రికెట్ చాంపియన్ విశాఖ


ట్రోఫీ అందుకుంటున్న విశాఖ జిల్లా టీమ్

విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మూలపాడు వేదికగా ఏసీఏ పర్యవేక్షణలో జరుగుతున్న అండర్-14 మల్టీ డేస్ అంతర్ జిల్లాల బాలుర క్రికెట్ చాంపియన్‌షిప్‌ను విశాఖపట్నం జిల్లా కైవసం చేసుకుంది. గుంటూరుతో జరిగిన మ్యాచ్‌ను విశాఖ డ్రా చేసుకోవడం ద్వారా అత్యధిక పాయింట్లతో విజేతగా అవతరించింది. నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతున్నాయి. విశాఖ జిల్లాకు ట్రోఫీని కేడీసీఏ సెక్రటరీ ఎం.రవీంద్రచౌదరి, చైర్మన్ పి.విజయ్‌కుమార్, కె.భరత్‌రెడ్డి, ఎం.కోటరెడ్డి, బి.మంగేష్‌లు అందజేశారు.

ఎన్‌డీఏ చిత్తశుద్ధికి నిదర్శనం: ఎంపీ

విశాఖపట్నం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కోస్తా రైల్వే జోన్ స్థాపనకు సంబంధించి టెండర్లు ఆహ్వానించనున్నట్టు రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ఎక్స్ ద్వారా వెల్లడించడంపై ఎంపీ శ్రీభరత్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నిర్ణయం ఎన్‌డీఏ ప్రభుత్వ చిత్తశుద్ధిని ప్రతిబింబిస్తోందన్నారు. దక్షిణ కోస్తా రైల్వే జోన్ త్వరలోనే వాస్తవంగా మారబోతోందన్నారు. ఉత్తరాంధ్ర ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడమే కాకుండా, ప్రాంతీయాభివృద్ధికి, మెరుగైన రవాణాకు, ఉద్యోగ అవకాశాలకు దారి తీస్తుందన్నారు. జోన్ స్థాపనలో కీలకపాత్ర పోషించిన సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. జోన్ వల్ల ఉత్తరాంధ్రకు భారీ ఆర్థిక ప్రయోజనాలు లభిస్తాయన్నారు.

సభ్యత్వ నమోదుపై టీడీపీ నేతల సమీక్ష

అక్కయ్యపాలెం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ పరిధి 45వ వార్డు నరసింహనగర్‌లో వార్డు టీడీపీ అధ్యక్షుడు భరణికాన రాజు ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదుపై ఆదివారం సమీక్షించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నాయకులు హనోక్, ముత్యాలనాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ పరిపాలన విధానంలో చంద్రబాబు నాయకత్వంపై ప్రజలు ఆకర్షితులై స్వచ్ఛందంగా పార్టీలో చేరేందుకు ముందుకు వస్తున్నారని, దీనిని దృష్టిలో ఉంచుకొని సభ్యత్వ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అప్పన్న, షేక్ బాబ్జీ, భాస్కరరాజు, లక్ష్మణరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్టీల్ ప్రైవేటీకరణ ఉండదని ప్రధాని ప్రకటించాలి

హెచ్ఆర్ఎఫ్ తొమ్మిదో జిల్లా మహాసభ డిమాండ్


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న శరత్, హటంగడి తదితరులు

సీతంపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నట్టు ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 29న విశాఖ జిల్లా పర్యటనలో ప్రకటించి ప్రజల ఆకాంక్షలను గౌరవించాలని మానవ హక్కుల వేదిక (హెచ్ఆర్ఎఫ్) ఆదివారం పౌరగ్రంథాలయంలో నిర్వహించిన విశాఖ జిల్లా తొమ్మిదో మహాసభ డిమాండ్ చేసింది. 'మన స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుందాం' అనే అంశంపై వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.శరత్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రక్రియను నిలిపివేసేలా ప్రధానిపై సీఎం చంద్రబాబు నాయుడు ఒత్తిడి తేవాలన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయిస్తే ఏడాదికి రూ.5 వేల కోట్లు లాభాలు వస్తాయన్నారు. ఈ విషయంలో కావాలనే కుట్రలు చేస్తున్నారన్నారు.

ప్రజలకు భద్రత కరవు: పర్యావరణ ప్రచారకర్త సోహన్ హటంగడి మాట్లాడుతూ బొగ్గు కాలుష్యం, అమ్మోనియం నైట్రేట్‌తో నగర ప్రజల ప్రాణాలకు భద్రత లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాలుష్యం తగ్గించే ప్రణాళికలను ప్రభుత్వాలు సిద్ధం చేయాలన్నారు. హెచ్ఆర్ఎఫ్ ప్రచురించిన 'పరిశ్రమల్లో మరణ మృదంగం, పారిశ్రామిక భద్రత, కాలుష్యంపై నివేదికతో కూడిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. సభకు హెచ్ఆర్ఎఫ్ ప్రచురణల సంపాదకులు కె.అనురాధ అధ్యక్షత వహించగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై. రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అవగాహన కోసం 'పరుగు'



తీరంలో పరుగు కార్యక్రమంలో పాల్గొన్న ఔత్సాహికులు

మహారాణిపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్‌ను స్మరించుకుంటూ బీచ్‌రోడ్డులో పదోసారి పరుగు నిర్వహించారు. ఆదివారం విశాఖ సాగర తీరంలో భీమ్‌సేన్ వ్యవస్థాపకుడు ఎం.రవి సిద్ధార్థ నాయకత్వంలో కాళీమాత ఆలయం నుంచి వైఎంసీఏ వరకు పరుగు తీశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి టీఎస్ఎన్ మూర్తి జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో అసమానతల సంకెళ్లు తెంచి ప్రతీ భారతీయునికి మానవ హక్కులు తెచ్చిన రోజు 1949 జనవరి 26 అని పేర్కొన్నారు. వివక్ష లేకుండా అందరికీ విద్య అందించిన భారత రాజ్యాంగ దినోత్సవం రోజు కూడా ఇదేనన్నారు. ఈ కార్యక్రమం తీర ప్రాంత ప్రజలకు అవగాహన పెంచిందన్నారు. పీవీఆర్ మోహనరావు, ఉత్తరాంధ్ర ప్రజలు పాల్గొన్నారు.

ఏపీ ఐఆర్ఐఏ రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ వి.సురేష్


అధ్యక్షుడు డాక్టర్ సురేష్

విశాఖపట్నం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ రేడియాలజికల్ అండ్ ఇమేజింగ్ అసోసియేషన్(ఐఆర్ఐఏ) రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన విశాఖ డాల్ఫిన్ డయాగ్నోస్టిక్ ఎండీ డాక్టర్ వి.సురేష్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలోని ఒక హోటల్‌లో జరిగిన సాధారణ సమావేశం అనంతరం ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. ఐఆర్ఐఏ 25,000 మంది రేడియాలజిస్టులతో కూడిన జాతీయ స్థాయి సంఘం. ఈ సందర్భంగా డాక్టర్ సురేష్ మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి ప్రత్యేకంగా ప్రణాళికలు రూపొందించినట్టు తెలిపారు. తనకు ఈ బాధ్యతలు అప్పగించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమానికి గుంటూరుకు చెందిన పూర్వ అధ్యక్షుడు డాక్టర్ కిషోర్ కుమార్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వీఎస్ వరప్రసాద్, ఉపాధ్యక్షుడు డాక్టర్ మోహన్ ప్రసాద్, పలు వైద్యకళాశాలల రేడియాలజీ విభాగాధిపతులు, రేడియాలజిస్టులు పాల్గొన్నారు.

రెండోరోజూ గిరిజన సంబరం


బీచ్‌రోడ్డులో గిరిజన మహిళల సంప్రదాయ నృత్యం

మహారాణిపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): బీచ్‌రోడ్డులో గిరిజన స్వాభిమాన్ ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ శాఖ, గిరిజన సాంస్కృతిక శిక్షణ విభాగం ఆధ్వర్యంలో రెండోరోజు ఆదివారం పెద్దఎత్తున సందర్శకులు వీటిని తిలకించారు. గిరిజనుల నృత్యాలను, పలు సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు, ఈ సందర్భంగా గిరిజన సంత పేరుతో ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను, గిరిజన ఉత్పత్తులను పలువురు కొనుగోలు చేశారు.

మండలి విప్ వేపాడ చిరంజీవిరావుకు ఘన స్వాగతం


చిరంజీవిరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అభిమానులు

డాబాగార్డెన్స్/జగదాంబ కూడలి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో ప్రభుత్వ విప్‌గా నియమితులైన ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ డా.వేపాడ చిరంజీవిరావుకు ఆదివారం విశాఖ విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. అక్కడ నుంచి ఆయన కనకమహాలక్ష్మీ అమ్మవారి ఆలయానికి వెళ్లి దర్శనం చేసుకున్నారు. జాలరిపేట ప్రభుత్వ మూగ బాలుర వసతి గృహానికి సతీసమేతంగా వెళ్లి బాలురకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం సవేరా ఫంక్షన్ హాల్‌లో ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏయూ విశ్రాంత ఆచార్యులు సుదర్శన్‌రావు, హరిప్రకాష్, మోహన్‌రావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. తనకు ఈ పదవి రావడానికి కారకులైన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్‌లకు ధన్యవాదాలు తెలిపారు.

ప్రధాని సభకు భారీ ఏర్పాట్లు

... 5వ పేజీ తరువాయి

తెరపైకి తీసుకువచ్చారు. దీంతో పాటు విశాఖ ఉక్కు కర్మాగారం పునరుజ్జీవం కోసం ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించాలని కూడా కోరుతున్నారు.

ఏర్పాట్లపై కలెక్టర్ సమావేశం

ఇదిలావుండగా ప్రధానమంత్రి పర్యటన ఏర్పాట్లపై ఆదివారం కలెక్టరేట్‌లో అధికారులు, ప్రజాప్రతినిధులతో కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ సమావేశం నిర్వహించారు. ప్రధానమంత్రి పర్యటనలో రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి పాల్గొంటారని, వారికి బస ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. గవర్నర్ నోవాటెల్‌లో, సీఎం పోర్టు గెస్టు హౌస్‌లో ఉండేందుకు ప్రాథమికంగా చర్యలు తీసుకున్నామన్నారు. ఈనెల 29వ తేదీ సాయంత్రం ప్రధాని ఐఎన్ఎస్ డేగాకు చేరుకుని, అక్కడి నుంచి రోడ్డు మార్గం లేదా హెలికాప్టర్‌లో ఏయూకు చేరుకునే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. పలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసిన అనంతరం ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారన్నారు. రోడ్డు మార్గంలో వస్తే టైకూన్ జంక్షన్ నుంచి ఎస్పీ బంగ్లా వరకు రోడ్‌షో ఉంటుందన్నారు. ప్రధాని పర్యటన పూర్తివివరాలు రావాల్సి ఉందన్నారు. ఈ సమావేశంలో విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, ప్రభుత్వ విప్ పి.గణబాబు, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, పి.విష్ణుకుమార్‌రాజు, పంచకర్ల రమేశ్‌బాబు, నగర సీపీ శంఖబ్రాత బాగ్చి, డీసీపీ అజిత వేజెండ్ల, మేరీ ప్రశాంతి, జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్, జేసీ మయూర్ అశోక్, డీఆర్వో బీహెచ్ భవానిశంకర్, ఆర్డీవోలు శ్రీలేఖ, సంగీత్‌మాధుర్ పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేపు ఐదుగురు మంత్రుల సమీక్ష

ప్రధానమంత్రి పర్యటన విజయవంతం చేయడానికి ఈనెల 26న విశాఖపట్నం కలెక్టరేట్‌లో ఐదుగురు రాష్ట్ర మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీక్ష నిర్వహిస్తారు. ప్రధాని పర్యటనకు సంబంధించి తీసుకోనున్న చర్యలు, చేపట్టనున్న ఏర్పాట్లపై వీరు సమీక్షించనున్నారు.

చర్యలపై మీనమేషాలు!

... 5వ పేజీ తరువాయి

నిర్మాణం చేపట్టారని, రెండు వేర్వేరు భవనాలను నిర్మించాల్సి ఉండగా, ఒకే భవనం నిర్మించారని గుర్తించారు. ఈ నేపథ్యంలో భవనంపై ఎందుకుచర్యలు తీసుకోకూడదో చెప్పాలంటూ కార్పొరేటర్‌కు షోకాజ్ నోటీసు జారీచేశారు. ఈ స్థలంపై హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్నందున తుదితీర్పుకు లోబడి చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని భవన యజమానికి స్పష్టంచేశారు.

అయితే ఆ భవనంపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా వైసీపీకి చెందిన ఒక కార్పొరేటర్ భర్త, జీవీఎంసీలో స్టాండింగ్ కౌన్సిల్‌గా పనిచేస్తున్న న్యాయవాది రంగంలోకి దిగారు. భవన నిర్మాణ సమయంలో కూడా వీరు చక్రం తిప్పారనే ఆరోపణలున్నాయి. ఈ స్థలం ప్రభుత్వానికి చెందినదంటూ కొందరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయడంతో జీవీఎంసీ అధికారులు ప్లాన్ జారీచేయడానికి వెనుకాడారు. అయినప్పటికీ న్యాయపరంగా ఉన్న చిక్కులను ఆ న్యాయవాది తన తెలివితేటలతో పరిష్కరించారని, ఆపై వైసీపీకి చెందిన కీలక నేతలతో రెవెన్యూ జీవీఎంసీ అధికారులపై ఒత్తిడి తెచ్చి నిర్మాణానికి లైన్ క్లియర్ చేశారని ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో తాజాగా అక్రమభవనం విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' తిరిగి వెలుగులోకి తేవడంతో జీవీఎంసీ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. దీంతో అప్రమత్తమైన సదరు భవన యజమాని గతంలో తనకు సహకరించిన జీవీఎంసీ స్టాండింగ్ కౌన్సిల్‌ను సంప్రదించినట్టు సమాచారం. దీంతో న్యాయవాది తన పలుకుబడి, తెలివితేటలను ఉపయోగించడంతో పాటు భవన యజమాని ద్వారా కొందరికి డబ్బులు ఇప్పించి చర్యలు లేకుండా కాపాడేందుకు యత్నిస్తున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలోనే జీవీఎంసీ అధికారులు నోటీసు ఇచ్చిన తర్వాత చర్యలకు వెనుకాడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జీవీఎంసీకి నష్టం కలిగించే వ్యక్తిని స్టాండింగ్ కౌన్సిల్‌లో సభ్యుడిగా కొనసాగించడంపై ఇప్పటికైనా ఆలోచించాలని నగరవాసులు కోరుతున్నారు.

రైతుబజార్లలో స్టాళ్లకు డిమాండ్

... 5వ పేజీ తరువాయి

వ్యవహారంగా మారిందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. తాజాగా ఈ నెల 6న జిల్లాలోని 11 రైతుబజార్లలో 37 స్టాళ్లను అద్దె ప్రాతిపదికన కేటాయించడానికి వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ప్రకటన జారీచేసింది. ఇందులో డ్వాక్రా సంఘాలకు 29 స్టాళ్లు, మరో ఏడు దివ్యాంగులకు కేటాయించారు. డ్వాక్రా సంఘాలు కూరగాయలు పండించాల్సిన అవసరం లేదు. డిమాండ్ ఉన్న సరకులు కొనుగోలు చేసి తెచ్చి ఇక్కడ అమ్ముకోవచ్చు. నెలకు స్టాల్‌కు రూ.9వేలు అద్దె చెల్లించాలి. దివ్యాంగులైతే వారే స్టాల్ నడుపుకోవాలి. మరొకరి సాయం తీసుకోకూడదు. కుటుంబసభ్యుల సాయం తీసుకుంటున్నారని కొన్నిచోట్ల వారి కేటాయింపులు రద్దు చేశారు. దాంతో స్టాళ్లు ఖాళీ అయ్యాయి. డ్వాక్రా స్టాళ్లకు ఆశించిన దాని కంటే ఎక్కువ దరఖాస్తులు వచ్చాయి. వారు నిజంగా డ్వాక్రా గ్రూపుల్లో సభ్యులా ? కాదా? అని ప్రస్తుతం క్షేత్ర పరిశీలన చేస్తున్నారు. అయితే ఇవన్నీ పేరుకే. సిఫారసులకే పెద్దపీట వేస్తున్నారని బహిరంగంగానే విమర్శలు వినిపిస్తున్నాయి.

చిట్టివలసలో స్పందన శూన్యం

చిట్టివలసలో కొత్తగా రైతుబజారు ఏర్పాటుచేశారు. ఇంకా ప్రారంభించలేదు. ప్రస్తుతం పట్టణంలో ప్రధాన రహదారికి ఇరువైపులా కూరగాయల వ్యాపారాలు జరుగుతున్నాయి. జనం బాగానే వస్తున్నారు. కొత్త రైతుబజారు జాతీయ రహదారికి దగ్గరగా పెట్టారు. అక్కడికి జనం వస్తారో.. రారో అని అనుమానాలున్నాయి. అక్కడ ఐదు దుకాణాలను అద్దెకు ఇస్తామని వ్యవసాయ మార్కెటింగ్ శాఖాధికారులు ఈ నెల 6న ప్రకటన ఇచ్చారు. ఒక్కో దుకాణానికి దరఖాస్తుతో పాటు రూ.30వేలు డిపాజిట్ చెల్లించాలని నిర్దేశించారు. అయితే ఇప్పటివరకు ఇలా డిపాజిట్ కోరలేదు. కాగా ఇక్కడ స్టాళ్లకు ఒక్కరు కూడా ముందుకు రాలేదు. ఈ నెల 12న గడువు ముగిసిపోయింది. మళ్లీ నోటిఫికేషన్ ఇచ్చారు.

బెంబేలెత్తిస్తున్న గ్రామ సింహాలు

... 5వ పేజీ తరువాయి

పరిణమిస్తోంది. వృద్ధులు, చిన్నారులు కుక్కల బారిన పడి ప్రాణాలు పోగొట్టుకుంటున్న పరిస్థితులు ఎదురవుతున్నాయి. ప్రతి సోమవారం జోనల్ కార్యాలయంలో నిర్వహించే పీజీఆర్ఎస్‌లో అధికశాతం ఫిర్యాదులు కేవలం కుక్కలు, పందులు నియంత్రణపైనే అందుతున్నా అధికారులు స్పందించడం లేదు. గాజువాక పారిశ్రామిక ప్రాంతంలో కుక్కలు దాడి చేసిన సంఘటనలు కోకొల్లలు. పెదగంట్యాడ ప్రాంతంలో గత ఏడాది ఒంటరిగా వెళ్తున్న ఓ మహిళపై కుక్కల గుంపు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడింది. ఇటీవల మంగళపాలెంలో కుక్కల దాడిలో ఓ మహిళ మృతిచెందింది. ఇలాంటి సంఘటనలు పారిశ్రామిక ప్రాంతంలో నిత్యం చోటుచేసుకుంటున్నాయి. తాజాగా అగనంపూడిలో ఇంటి ముందు ఆడుకుంటున్న చిన్నారిని రెండు వీధికుక్కలు తీవ్రంగా గాయపరిచాయి. అదే విధంగా గాజువాక డ్రైవర్స్ కాలనీలో పందులు దాడి చేయడం ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. కుక్కల దాడిలో గాయపడి గాజువాక ప్రభుత్వ ఆస్పత్రికి నిత్యం ఒకరిద్దరు వస్తున్నారు. కుక్కలను నియంత్రించాలని స్థానికులు ఫిర్యాదులు చేస్తేనే అధికారులు స్పందిస్తున్నారనే విమర్శలున్నాయి. కుక్కలు పట్టే సిబ్బంది నామమాత్రంగా నాలుగైదు కుక్కలు పట్టుకొని కొంతదూరం వెళ్లిన తరువాత, వాటిని విడిచిపెడుతున్నారని ఆరోపిస్తున్నారు. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించకపోతే భవిష్యత్తులో మరిన్ని దారుణాలు జరుగుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ముదపాక ల్యాండ్‌పూలింగ్ అక్రమాలపై విజిలెన్స్


పెందుర్తి తహసీల్దార్ కార్యాలయంలో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

పెందుర్తి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముదపాకలో ప్రభుత్వ గృహ నిర్మాణాల కోసం చేపట్టిన భూ సమీకరణ ఆది నుంచీ వివాదాస్పదమవుతోంది. దీనిపై తాజాగా విజిలెన్స్ దృష్టి సారించింది. భూ సమీకరణలో ఇన్‌సైడ్ ట్రేడింగ్ జరిగిందని, అప్పటి వైసీపీ ప్రభుత్వంలో బినామీలతో భూ దందా చేశారని రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో శనివారం పెందుర్తి తహసీల్దార్ కార్యాలయంలో విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రీజనల్ అధికారి శ్రీనివాసుల బృందంతహసీల్దార్ ఆనంద్‌కుమార్ నుంచి వివరాలు సేకరించింది. ఎంతమొత్తంలో ల్యాండ్ పూలింగ్ జరిగింది, జగనన్న కాలనీకి ఎంత కేటాయించారు, రైతులకు అందిన పరిహారం, తదితర దస్త్రాలను పరిశీలించారు.

ఇదీ వివాదం: ముదపాకలో జగన్నకాలనీకు భూములిచ్చిన రైతులకు పరిహారం కింద పట్టాలు, ఎల్‌పీసీలు ఇవ్వలేదు. దీంతో రైతులు కోర్టును ఆశ్రయించి స్టేటస్ కో తెచ్చుకున్నారు. కాగా జగనన్న కాలనీలో విధులకు విఘాతం కలిగిస్తున్నారంటూ ఇటీవల తొమ్మిదిమంది రైతులపై తహసీల్దార్ ఫిర్యాదు నేపథ్యంలో పోలీసులు కేసు నమోదు చేశారు. కోర్టు స్టేటస్ కో ఇచ్చిందని పేర్కొంటూ సుమారు 50 ఎకరాల భూముల్లో రైతులు హెచ్చరిక బోర్డులు పెట్టగా, ఇవే భూములను ల్యాండ్ పూలింగ్‌లో సేకరించామంటూ వాటిని తొలగించి, రెవెన్యూ సిబ్బంది హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అయితే ల్యాండ్ పూలింగ్‌లో 130 మంది రైతుల నుంచి 400 ఎకరాలు సేకరించగా, డీ పట్టా పట్టాదారులకు ఎకరాకు 900 గజాలు, ఆక్రమణదారులకు 450 గజాల చొప్పున ఇవ్వాలని గత ప్రభుత్వం నిర్ణయించి ఎల్‌పీసీ జారీచేసింది. కొంతమందికి ఎల్‌పీసీలు ఇచ్చి మరికొంతమందిని విస్మరించడంతో వివాదానికి బీజం పడింది. రైతులకు పరిహారంగా ఇచ్చే భూములను చూపకపోవడంతో కొంతమంది హైకోర్టును ఆశ్రయించారు. ఇలా సుమారు 95 మంది పోరాడుతున్నారు. వైసీపీ నేతల సూచనలతో రెవెన్యూ అధికారులు జగన్నాటకానికి తెర తీశారనే ఆరోపణలున్నాయి. బినామీలకు రిజిస్ట్రేషన్లు చేశారని, లబ్ధిదారుల పేర్లు మాయమయ్యాయని ఫిర్యాదులు అందడంతో విజిలెన్స్ తనిఖీలు జరిగాయి.

రోడ్డు ప్రమాదాల నివారణకే జర్నలిస్టులకు హెల్మెట్ల పంపిణీ

సీతంపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నగరంలో జర్నలిస్టులకు తన శక్తిమేర సహాయం అందిస్తానని ఏపీ ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ చైర్మన్ ఉపకార్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ కంచర్ల అచ్యుతరావు పేర్కొన్నారు. ఆదివారం పౌరగ్రంథాలయంలో ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఏపీ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్, ఏపీ స్మాల్ అండ్ మీడియా న్యూస్ పేపర్స్ అసోసియేషన్ విశాఖ యూనిట్ల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అచ్యుతరావు మాట్లాడుతూ విశాఖ నగరంలో రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు తన వంతుగా జర్నలిస్టులకు ఉచితంగానే హెల్మెట్‌లు అందజేస్తున్నామన్నారు. ఎవరికైనా హెల్మెట్ అందకపోతే తమ ఉపకార్ ట్రస్టు కార్యాలయంలో సంప్రదించి ఉచితంగా తీసుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు జర్నలిస్టు నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన రీ నెక్స్ ఎక్స్‌పో


సోలార్ విద్యుత్ ప్రదర్శనలో సందర్శకులు

మద్దిలపాలెం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ సోలార్ ఎనర్జీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏయూ మైదానంలో రీనెక్స్ పేరుతో నిర్వహిస్తున్న సోలార్ రెన్యూవబుల్ ఎనర్జీ ఎక్స్‌పో - 24 ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు హేమకుమార్ మాట్లాడుతూ ఏయూ మైదానంలో మూడు రోజుల పాటు నిర్వహించిన సౌర విద్యుత్ ప్రదర్శనలో 40 స్టాల్స్ ఏర్పాటు చేయగా నగర ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. వ్యాపారవేత్తలు, రాజకీయ ప్రముఖులు ప్రదర్శనను సందర్శించి స్టాల్స్‌ను పరిశీలించారని చెప్పారు. సోలార్ ప్లాంటులకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సూర్యఘర్ పథకాల లబ్ధి వివరాలను వినియోగదారులు తెలుసుకున్నారన్నారు. విశాఖలో విజయవంతమైన ఎక్స్‌పోతో రాష్ట్రవ్యాప్తంగా మరెన్నో ప్రదర్శనలు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామ్మోహనరావు, ఉపాధ్యక్షుడు నాగరాజు, కోశాధికారి జయబాబు, సంయుక్త కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మహా అక్రమం

... 5వ పేజీ తరువాయి

చెల్లింపు జరిగింది. ఆతర్వాత పనులు పూర్తి చేసిన వారి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. జీవీఎంసీ ఖాతాలో కొంత నిధులు జమ కాగానే సీరియల్ నంబరు ఆధారంగా ముందుగా పని పూర్తిచేసిన కాంట్రాక్టర్లకు వరుస క్రమంలో బిల్లులు చెల్లించాలనేది నిబంధన. ఇదిలావుండగా ఫిబ్రవరి 18 తర్వాత పనులు పూర్తిచేసిన కాంట్రాక్టర్లను పక్కనపెట్టి ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో పనులు చేసిన కాంట్రాక్టర్లకు ఇటీవల భారీగా బిల్లుల చెల్లింపు చేపట్టడం వివాదానికి దారితీసింది. తొమ్మిది నెలల కిందట పనులు పూర్తిచేసి బిల్లు కోసం ఎదురుచూస్తుంటే ఇటీవల చేసినవారికి ఎలా చెల్లించారంటూ కొందరు బహిరంగంగానే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చక్రం తిప్పిన కాంటాక్టర్ల సంఘం నేతలు

కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులో అధికారులు పరిగణనలోకి తీసుకోవాల్సిన వర్క్ సీనియారిటీ జాబితాను పక్కనపెట్టి, ఇటీవల పనులు పూర్తిచేసిన వారికి బిల్లుల చెల్లింపులో కాంట్రాక్టర్ల సంఘంలోని కొందరు నేతలే చక్రం తిప్పారని చెబుతున్నారు. త్వరగా బిల్లులు వచ్చేలా చూడాలంటూ జీవీఎంసీలో చెల్లింపు వ్యవహారాలను చూసే ద్వితీయశ్రేణి అధికారిని కలిశారు. ఇందుకోసం ఐదు శాతం కమీషన్ ఇస్తామని ప్రతిపాదించారు. తాను ఏమీ చేయలేనని, ఏదో ఒక కారణం చూపించి కమిషనర్‌కు విన్నవించాలని అతడు సూచించారు. ఈ నేపథ్యంలో కుటుంబ సభ్యులకు తీవ్ర అనారోగ్యమని, వైద్యం చేయించడానికి డబ్బుల్లేవని కొందరు, పిల్లలను ఉన్నతవిద్యకు విదేశాలకు పంపాలని మరికొందరు, పిల్లలకు పెళ్లిచేయాల్సి ఉందని ఇంకొందరు తప్పుడు కారణాలతో కమిషనర్‌ను తప్పుదారి పట్టించారని చెబుతున్నారు. దీంతో పరిశీలించాలని బిల్లులు చెల్లింపు వ్యవహారాలను చూసే అధికారికి కమిషనర్ సూచించారు. ఆ అవకాశం కోసమే ఎదురుచూస్తున్న ఆ అధికారి ఒక్కో కాంట్రాక్టర్ నుంచి ఐదు శాతం కమీషన్ వసూలు చేశారని, కాంట్రాక్టర్ల సంఘం పేరుతో ఒక శాతాన్ని తీసుకుని పనిచేసి పెట్టారని తెలిసింది.

ఇవీ ఉదాహరణలు

బీచ్‌రోడ్డులోని ఓ పార్కులో పనులను ఆగస్టులో పూర్తిచేసిన యూనియన్ నేతకు అధికారులు రెండు బిల్లులను చెల్లించేశారు. గతంలో కాంట్రాక్టర్ల సంఘంలో కీలకంగా పనిచేసి, ప్రస్తుతం వైసీపీలో కీలకనేతగా ఉన్న కాంట్రాక్టర్ ఒకరు తన కుమారుడి ద్వారా బినామీపేరుతో మూడు పనులు సెప్టెంబరులో పూర్తిచేస్తే, వాటికి బిల్లుల చెల్లింపులు జరిగిపోయాయి. ఇలా యూనియన్‌లో కొందరు కాంట్రాక్టర్లతోపాటు ఇతర కాంట్రాక్టర్లు ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో చేసిన పనులకు బిల్లులు తీసుకున్నారు. తాము పనులు చేసి తొమ్మిది నెలలు గడుస్తున్నా బిల్లులు కాలేదని, కానీ రెండు నెలల కిందట పనులుచేసిన వారికి బిల్లులు ఎలా చెల్లిస్తారని మిగిలిన కాంట్రాక్టర్లు ప్రశ్నిస్తున్నారు.

నిరుపయోగంగా మరుగుదొడ్లు


జెఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో ఇలా...

జ్ఞానాపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జ్ఞానాపురంలోని జెఎన్ఎన్ యూఆర్ఎం కాలనీ వద్ద (41వ వార్డు) జీవీఎంసీ దుకాణాలు నిర్మించి పర్యవేక్షణ బాధ్యత విస్మరించింది. ఇదే ప్రాంతంలో కాలనీ నివాసితుల కోసం మరుగుదొడ్లు (బయోటాయిలెట్లు) ఏర్పాటు చేసినా, వాటిని వినియోగించకుండా వదిలేశారు. వాటి వద్ద పిచ్చిమొక్కలు అల్లుకుపోయి దుర్గంధభరితంగా మారుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. వాటికి అనుకునే నీళ్లట్యాంకు ఉండ డంతో నీరు కలుషితమవుతుందేమోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ మరుగుదొడ్లను అక్కడ నుంచి తొలగించాలని పలువురు కోరుతున్నారు.

ఘనంగా కార్తీక సమారాధన


కుసుమ హరనాథులు

డాబాగార్డెన్స్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మహా నగర విశాఖ పరిధిలోని శ్రీ కుసుమ హరనాథ ఆశ్రమంలో ఆదివారం కార్తీక సమారాధన నిర్వహించారు. కుసుమ హరనాథులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎం.విజయలక్ష్మి కామేశ్వరి సంకీర్తన, భక్తులు సామూహిక షోడసాక్షరి నామ సంకీర్తన, భక్తి గీతాలాపన నిర్వహించారు. ఎం.వి.రాజశేఖర్ ఆధ్యాత్మిక ప్రసంగం ద్వారా భగవన్నామస్మరణ విశిష్టతను, కార్తీక మాస ప్రాముఖ్యతను తెలిపారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి, అన్నప్రసాద వితరణ గావించారు. కార్యక్రమంలో ఆశ్రమ అధ్యక్షుడు బీవీ బాబాజీ, కార్యదర్శి ఆర్.వి.ఎస్.రమేష్, సహాయ కార్యదర్శి కె.మంగరాజు, బి.కుసుమ, పి.సూర్యకుమారి, అచ్యుతాంబ పాల్గొన్నారు.

పోర్టు హైస్కూల్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


సమావేశమైన 1998-99 పదోతరగతి విద్యార్థులు

విశాఖపట్నం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పోర్టు హై స్కూల్‌లో 1998-99 పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. ఆత్మీయ సమావేశాన్ని మురళీనగర్‌లోని ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు కూడా పాల్గొన్నారు.


చందనభరితుడైన వేంకటేశ్వరస్వామి

వైభవంగా విష్ణు సహస్రనామ నక్షత్ర పారాయణం

ఎన్.ఎ.డి.జంక్షన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 90వ వార్డు పరిధి విమాన్‌నగర్‌లోని వైకుంఠ వేంకటేశ్వరాలయంలో ఆదివారం వైభవంగా సామూహిక విష్ణు సహస్రనామ నక్షత్ర పారాయణం నిర్వహించారు. ఈ సందర్భంగా వేంకటేశ్వరస్వామిని చందనంతో ప్రత్యేకంగా అలంకరించారు. సామూహిక విష్ణు సహస్రనామ పారాయణాన్ని 27సార్లు పఠించారు. మధ్యాహ్నం భక్తులకు అన్న సమారాధన చేపట్టారు.

అన్న సమారాధనను ప్రారంభించిన గణబాబు

మల్కాపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి ప్రకాశనగర్ శివరామకృష్ణ ఆలయం వద్ద నిర్వహిస్తున్న గౌరీపరమేశ్వరుల ఉత్సవాల్లో భాగంగా ఆదివారం చేపట్టిన అన్న సమారాధనను ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు ప్రారంభించారు. ముందుగా ఆయన గౌరీపరమేశ్వరులకు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనే పశ్చిమ నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొరిబిల్లి రాము, పి.హరిబాబు, ఉత్సవ నిర్వాహకులు వెంకట అప్పారావు, జగదీశ్, తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణుల వన సమారాధన

పెందుర్తి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పాత పెందుర్తిలో కాశీ విశ్వేశ్వరాలయంలో ఆదివారం బ్రాహ్మణుల కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు ముక్కు శివరామకృష్ణ ఆధ్వర్యంలో కార్తీక వన భోజనాలను ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో బ్రాహ్మణులు కుటుంబాలతో విచ్చేసి ఆనందంగా గడిపారు.

టీటీడీలో నేడు దీపోత్సవం

విశాఖపట్నం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానాలు, హిందూ ధర్మ పరిషత్ ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపంలో సోమవారం సాయంత్రం 5 నుంచి 8 గంటల వరకు కార్తీక దీపోత్సవం నిర్వహించనున్నారు. ముందుగా వేంకటేశ్వరుని పంచలోహ విగ్రహాలకు పూజలు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనవలసిందిగా నిర్వాహకులు కోరారు.

సినిమా గైడ్

- **కంగువా:** సంగం, జగదాంబ, మెలోడి, శ్రీరామ, కామేశ్వరి, కిన్నెర, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం) కన్య కాంప్లెక్స్ (గాజువాక)
- **మట్కా :** శరత్, శారద, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్-3 (గాజువాక)
- **అపుడో, ఇప్పుడో, ఎప్పుడో:** లిఖిత (శ్రీహరిపురం)
- **క :** జగదాంబ, సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **లక్కీ భాస్కర్:** శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా),సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **అమరన్:** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్, నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **బఘీర :** వెంకటేశ్వర, శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ)
- **దేవర :** రమాదేవి, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 54, టమాటా 28, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 52, బెండకాయలు 18, పచ్చిమిర్చి 32, కాకరకాయల 40, బీరకాయలు 38, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 30, క్యారెట్ 64 దొండకాయలు 32, బంగాళదుంపలు 40, అరటికాయ (పెద్దది) 6, అల్లం (పాతది)50, మునక్కాడలు (కిలో) 74, బరబాటి 30, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 36, దోసకాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్(పెన్సిల్) 55, పొటల్స్ 52, కీరదోస 24, క్యాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 42, చిలగడదుంపలు 32, కంద 66, దేముడు చిక్కుడు 82, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, కర్రపెండలం 45, మామిడి అల్లం 60, బొప్పాయి 40, బూడిద గుమ్మడికాయ 30, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	580
విజయనగరం	584
శ్రీకాకుళం	584

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	110
ఫారం ధర	130
విత్ స్కిన్	230
స్కిన్‌లెస్	240


పాత గాజువాకలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతున్న సీహెచ్ నరసింగరావు


సంఘీభావం తెలుపుతున్న నాయకులు

‘ఉక్కు’పై మోదీ స్పష్టమైన ప్రకటన చేయాలి

- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు
- కార్మిక వ్యతిరేక విధానాలను ప్రభుత్వాలు విడనాడాలి
- గాజువాకలో భారీ కార్మిక ప్రదర్శన

గాజువాక, నవంబరు 24: విశాఖ పర్యటనకు విచ్చేస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిలిపివేస్తున్నట్టు స్పష్టమైన ప్రకటన చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిలిపివేయాలని, సెయిల్‌లో విలీనం చేయాలంటూ ఆదివారం పాత గాజువాకలో కార్మిక ప్రదర్శన చేపట్టారు. పాత గాజువాక నుంచి కొత్త గాజువాక వరకు, మళ్లీ అక్కడ నుంచి పాత గాజువాక వరకు ఈ ప్రదర్శన సాగింది. అనంతరం అక్కడ జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ అండతో దేశాన్ని కబళిస్తున్న కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా పోరాటాలను మరింత ఉధృతం చేయాలన్నారు. దేశ ప్రతిష్ఠను దెబ్బతీసిన అదానీపై ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలన్నారు.

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్లు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్‌లు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం కార్మికుల ఆర్థిక ప్రయోజనాలపై విధించిన ఆంక్షలను తక్షణమే విరమించుకోవాలన్నారు. దేశ సంపదను సృష్టిస్తున్న కార్మిక వర్గంపై దాడులు సరికాదన్నారు. విశాఖ విచ్చేస్తున్న ప్రధానికి స్టీల్‌ప్లాంట్ గురించి, ఇక్కడ నెలకొన్న పరిస్థితులను కూటమి నాయకులు వివరించాలని కోరారు. ప్లాంట్ పరిరక్షణ కోసం తాము ఎలాంటి పోరాటాలకైనా సిద్ధమన్నారు. కార్యక్రమంలో రాజకీయ నాయకులు పల్లా చిన్నతల్లి, మణి, రైతుసంఘం నాయకులు ఈశ్వర్, రెడ్డి వెంకటరావు, కుమార మంగళం, రాంబాబు, ఉక్కు పోరాట కమిటీ నేతలు కేఎస్ఎన్ రావు, జె.అయోధ్యరామ్, కేఎం శ్రీనివాస్, కారు రమణ, రామారావు, డీవీ రమణారెడ్డి, కరణం సత్యారావు, వరసాల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి రోడ్డు నిర్మాణ పనులతో అవస్థలు

ఇసుక, రాళ్లు తేలడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ద్విచక్ర వాహనదారుల ఆవేదన

ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు స్పందించాలని వేడుకోలు


ఇసుక, కంకర రాళ్లు తేలడంతో అధ్వానంగా మారిన జాతీయ రహదారి

అగనంపూడి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అగనంపూడి టోల్ గేటు సమీపంలో జాతీయ రహదారి అధ్వానంగా తయారైంది. ఇక్కడ పెద్ద పెద్ద గోతులు ఏర్పడడంతో రహదారి మరమ్మతుల నిమిత్తం ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు టోల్ గేటు నుంచి స్థానిక పెట్రోల్ బంక్ వరకు సుమారు అరకిలో మీటరు పొడవునా తవ్వకాలు జరిపి పై లేయర్‌ను తొలగించి అసంపూర్తిగా విడిచిపెట్టేశారు. సుమారు 20 రోజులు గడిచినా మరమ్మతు పనులు చేపట్టకపోవడంతో వాహన చోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనాల రాకపోకలతో రహదారి పొడవునా కంకర పిక్కలు, ఇసుక తేలిపోయింది. దీంతో ద్విచక్ర వాహనాలు స్కిడ్ అయి జారి పడిపోతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విపరీతమైన దుమ్ము, ధూళి గాలిలోకి ఎగసిపడడంతో వాహనదారుల అవస్థలు వర్ణనాతీతంగా మారింది. ఫార్మాసిటీ ఉద్యోగులు, కార్మికులతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు ఈ రహదారి గుండానే రాకపోకలు సాగిస్తున్నారు. అయితే కంకర, ఇసుక కారణంగా వాహనాలు అదుపు తప్పడంతో సుమారు ఇరవై మంది వరకు గాయపడిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు రహదారి మరమ్మతు పనులను అసంపూర్తిగా విడిచిపెట్టడం పట్ల వాహనదారులు మండిపడుతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి రహదారి మరమ్మతు పనులు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

అధికారుల తీరు దారుణం

-మామిడి శ్రీనివాసరావు, అగనంపూడి



రహదారి పై లేయర్‌ను తొలగించి నిర్మాణ పనులను ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు అసంపూర్తిగా విడిచిపెట్టడం దారుణం. కంకర, ఇసుక తేలిపోవడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించాలంటేనే భయమేస్తోంది. వాహనాలు అదుపు తప్పి జారిపోతున్నాయి. ఇప్పటివరకు జరిగిన ప్రమాదాలను దృష్టిలో పెట్టుకునైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి.

సమస్యలు పరిష్కరించేంత వరకు ఉద్యమం ఆగదు

విశాఖ డెయిరీ కార్మికుల మహా ధర్నాలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు


మహా ధర్నాలో మాట్లాడుతున్న సీహెచ్ నరసింగరావు

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వేతన సవరణతో పాటు కార్మికుల కనీస హక్కులను విశాఖ డెయిరీ యాజమాన్యం అంగీకరించేంత వరకు కార్మికులు చేపట్టిన ఉద్యమం ఆగదని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు అన్నారు. పలు సమస్యల పరిష్కారం కోరుతూ విశాఖ డెయిరీ కో-ఆపరేటివ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా డెయిరీ మెయిన్ గేటు ఎదుట నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షల్లో భాగంగా ఆదివారం చేపట్టిన మహా ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో ఏ డెయిరీలోనూ లేని విధంగా ఇక్కడ కంపెనీ చట్టాన్ని గత 20 ఏళ్లుగా అమలు చేస్తూ కార్మికుల శ్రమను, రైతుల కష్టాన్ని డెయిరీ యాజమాన్యం దోచుకోవడం ఎంతో బాధాకరమన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం నిరంకుశ ధోరణిని విడనాడి కార్మికులకు కనీస వేతనాలు, కనీస హక్కులను కల్పించాలని నరసింగరావు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్.రమణ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కేఎస్ శ్రీనివాస్, వివిధ పరిశ్రమల నాయకులు రామస్వామి, కుమార మంగళం, సనపల జగన్నాథరావు, ఎం.రాంబాబు, కె.మణి, లోకేశ్, వెంకటరెడ్డి, నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.


జూ ప్రవేశద్వారం వద్ద సందర్శకులు

జంతు ప్రదర్శనశాల కిటకిట

ఆదివారం ఒక్కరోజే రూ.9,61,720 ఆదాయం

విశాఖపట్నం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్తీక సమారాధనలకు విచ్చేసిన సందర్శకులతో ఆదివారం ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాల కిటకిటలాడింది. జిల్లానుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి సైతం సందర్శకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో తరలిరావడంతో జూ కళకళలాడింది. ఆదివారం ఒక్కరోజే 13,650 మంది జూకు రావడంతో రూ.9,61,720 ఆదాయం వచ్చినట్టు క్యూరేటర్ మంగమ్మ తెలిపారు. కాగా వాహనాల పార్కింగ్‌కు స్థలం లేకపోవడంతో అత్యధికులు రహదారి పక్కనే వాటిని నిలిపివేశారు. అలాగే కంబాలకొండకు సందర్శకుల తాకిడి పెరిగింది. సుమారు 1,500 మంది రావడంతో రూ.లక్షా 12 వేల ఆదాయం సమకూరినట్టు అధికారులు తెలిపారు. అత్యధికులు ఎంతో ఉత్సాహంగా బోటు షికార్ చేశారు. ముడసర్లోవ పార్కుకు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలతో పాటు కుల, ఉద్యోగ సంఘాలు విచ్చేసి ఆటపాటలతో ఆనందంగా గడిపారు.


తెల్లపులిని ఆసక్తిగా తిలకిస్తున్న సందర్శకులు

ఆశ్రమానికి వృద్ధురాలి అప్పగింత

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఓ వృద్ధురాలిని స్టీల్‌ప్లాంట్ పోలీసులు ఆదివారం వృద్ధాశ్రమంలో చేర్పించారు. స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ వీవీవీ స్కూల్ ప్రాంతంలో శనివారం రాత్రి ఓ వృద్ధురాలు కనిపించడంతో ఓ వ్యక్తి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు పోలీసులు ఆమెను స్టేషన్‌కు తీసుకువచ్చి మాట్లాడారు. ఆమె ఎటువంటి వివరాలు చెప్పలేకపోతుండడంతో నగరంలోని ఓ వృద్ధాశ్రమంలో చేర్పించామని సీఐ ఈ.కేశవరావు తెలిపారు.

విద్యార్థికి ఆర్థిక సాయం అందజేత

అగనంపూడి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నిరుపేద విద్యార్థి కాండ్రేగుల కుమార్ వెంకట శివరామజోగికి సమాచార హక్కు చట్టం ఉద్యమకర్త పట్టా రామఅప్పారావు ఆదివారం రూ.15 వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువులో ముందుండే శివ రామజోగికి పేదరికం అడ్డు కాకూడదని భావించి ఆర్థిక సాయం అందించినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో దాతలు గుడే సుశీల గజేంద్రరరావు, ఎన్.రమేశ్, బి.ఈశ్వరరావు, పి.వసంతరావు, ఎం.శ్రీను, సోమశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రాణ దానంతో సమానం రక్తదానం

పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

వేపగుంట నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అందరూ రక్తదానం చేయడం ద్వారా ఎంతోమందికి ప్రాణదానం చేసిన వారవుతామని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. 94వ వార్డు పరిధి ముత్యాలమ్మ అయ్యప్ప సేవా పీఠం, రోటరీ బ్లడ్ బ్యాంక్, మెడికవర్ ఆస్పత్రి సంయుక్తంగా ముత్యాలమ్మ ఆలయం వద్ద ఆదివారం ఉదయం ఉచిత రక్తదాన, వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పంచకర్ల మాట్లాడుతూ యువత అయ్యప్ప సేవా పీఠం ద్వారా అందిస్తున్న సేవలు ఆదర్శనీయమన్నారు. గౌరవ అతిథిగా హాజరైన టీడీపీ ‘పెందుర్తి’ ఇన్‌చార్జి గండిబాబ్జి రక్తదాతలకు ధ్రువపత్రాలు, పండ్లు అందజేశారు. ఈ శిబిరంలో పలువురికి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాస్, కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు, సేవాపీఠం వ్యవస్థాపకుడు మామిడి నవీన్, లవ్‌కుమార్, శివ, వేణు, పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

యూజీడీ పనులను అడ్డుకున్న దేవస్థానం అధికారులు

వేపగుంట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 93వ వార్డు పరిధి సాయిమాధవనగర్ శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి వెళ్లే మార్గంలోఓ చేపడుతున్న యూజీడీ పనులను సింహాచల దేవస్థానం అధికారుల ఆదేశాలతో సిబ్బంది అడ్డుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న కార్పొరేటర్ రాపర్తి కన్నా అక్కడకు చేరుకుని సిబ్బందిని నిలదీశారు. అలాగే ఈ విషయాన్ని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. దీనిపై దేవస్థానం అధికారులను వివరణ కోరగా.. ఆ స్థలానికి సంబంధించిన పత్రాలను చూపిస్తే తాము పనులకు ఆటంకం కలిగించబోమని పేర్కొన్నారు.

వైఎస్సార్‌టీయూసీ ఉక్కు ప్రధాన కార్యదర్శిగా రమణారెడ్డి



ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వైఎస్సార్‌టీయూసీ స్టీల్‌ప్లాంట్ ప్రధాన కార్యదర్శిగా డీవీ రమణారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్ఠానం ఆయనకు నియామక ఉత్తర్వులను అందజేసింది. ఇప్పటివరకు ప్రధాన కార్యదర్శిగా ఉన్న వై.మస్తానప్ప ఇటీవల మృతి చెందడంతో ఆయన స్థానంలో రమణారెడ్డిని నియమించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా పోరాటాలు చేస్తామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

ఒకేరోజు పంచారామాలకు 11 ప్రత్యేక సర్వీసులు


కార్యక్రమంలో పాల్గొన్న ఆర్ఎం అప్పలనాయుడు, తదితరులు

ద్వారకా బస్‌స్టేషన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): విశాఖ నుంచి పంచారామాలకు ఆదివారం 11 ప్రత్యేక సర్వీసులు బయలుదేరాయి. ఆర్టీసీ విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పల నాయుడు వీటిని ద్వారకా బస్‌స్టేషన్‌లో ప్రారంభించారు. ఈ బస్సులు సోమవారం ఉదయానికి అమరావతి చేరుకుని అక్కడ అమరేశ్వరుని దర్శించుకున్నాక తదుపరి నాలుగు ఆలయాలను దర్శించుకుని సోమవారం రాత్రికి తిరిగి విశాఖ చేరుకుంటాయని ఆర్ఎం వెల్లడించారు. కార్యక్రమంలో విశాఖపట్నం డిపో మేనేజర్ గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను ఇబ్బందులకు గురి చేయవద్దు

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదని ఏఐటీయూసీ కాంట్రాక్టు కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి మంత్రి రవి అన్నారు. యూనియన్ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీతాల విషయంలో యాజమాన్యం అత్యంత దుర్మార్గంగా వ్యవహరిస్తుందన్నారు. కార్యక్రమంలో సోంబాబు, మురళీకృష్ణ, నూకరాజు, రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


ఆలయంలో సహస్ర దీపాలంకరణ..శ్రీవారికి ఊంజల సేవ చేస్తున్న అర్చకులు

బాలాజీ దివ్యక్షేత్రంలో సహస్ర దీపాలంకరణ

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకుని షీలానగర్ ఎస్‌బీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన సహస్ర దీపాలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఆదివారం సాయంత్రం వేదపండితులు ఆలయంలో వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశాక భక్తులచే ఆకాశ దీపానికి పూజలు చేయించి వెలిగింపచేశారు. అనంతరం ఆలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఊయలలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారిని ఆశీనులను చేసి వేదపండితులు ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయంలో అమర్చిన సహస్రదీపాలను భక్తులచే వెలిగింపజేశారు. దీపాలంకరణ సేవలో పాలక మండలి సభ్యులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు

పెదగంట్యాడ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 65వ వార్డు శ్రీదేవి, భూదేవి సమేత వైకుంఠ వేంకటేశ్వరాలయంలో ఆదివారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు జరిపారు. ప్రధాన అర్చకులు ప్రదీప్‌చంద్ర ఆధ్వర్యంలో జరిపిన వ్రతాలలో 101 దంపతులు పాల్గొన్నారు. కార్తీకంలో వైకుంఠనాథుని ఆలయంలో సత్యనారాయణస్వామి వ్రతాన్ని ఆచరించడంవల్ల మంచి ఫలితాలు ఉంటాయని అర్చకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ దొడ్డి రమణ, ధర్మకర్త మంత్రి మంజులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గణబాబుకు బీజేపీ నాయకుల అభినందనలు


ప్రభుత్వ విప్ గణబాబును సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

ఎన్.ఎ.డి.జంక్షన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ విప్‌గా నియమితులైన పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబును బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ దాడి పురుషోత్తమ రమేశ్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా పురుషోత్తమ రమేశ్ మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులను గణబాబు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పి.శ్రీనివాసరావు, కె.విజయబాబు, చల్లా మంజుల, వి.శ్రీనివాసరావు, ఎం.ప్రకాశ్, కె.గురుమూర్తి, జి.అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి టీడీపీ సేవలు ఎంతో అవసరం

86వ వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ

పలు ప్రాంతాల్లో టీడీపీ సభ్యత్వ నమోదులు


సభ్యత్వ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న నల్లూరు సూర్యనారాయణ

కూర్మన్నపాలెం,నవంబరు 24: రాష్ట్రాభివృద్ధికి, ప్రజా శ్రేయస్సుకు తెలుగుదేశం పార్టీ సేవలు ఎంతో అవసరమని 86వ వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ అన్నారు. 86వ వార్డు లక్కరాజుపాలెం, దువ్వాడలలో ఆదివారం చేపట్టిన టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. వంద రూపాయల టీడీపీ సభ్యత్వ నమోదుతో ఆ కుటుంబానికి భరోసా, భద్రత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు వేగుంట శ్రీనివాస్, గణపతి, సుబ్బయ్య, రమేశ్, తదితరులు పాల్గొన్నారు. అలాగే 87వ వార్డు వడ్లపూడిలోని టీడీపీ కార్యాలయం వద్ద చేపట్టిన కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ మాట్లాడుతూ ప్రతి కార్యకర్త సభ్యత్వ నమోదును ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని కోరారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్ఎస్ విజయరామరాజు, రాజన్‌రాజు, ఎం.రాము, సత్తిబాబు, ప్రగడ దానయ్య, ఎస్.శ్రీను, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా 71వ వార్డు శ్రీనగర్, శ్రీరామ్‌నగర్, సుందరయ్య కాలనీల్లో చేపట్టిన టీడీపీ సభ్యత్వ నమోదులో రాష్ట్ర చేనేత విభాగం నాయకుడు పప్పు రాజారావు పాల్గొని మాట్లాడారు. కార్యకర్తల పార్టీ టీడీపీ అని అన్నారు. కార్యక్రమంలో నాయకులు పప్పు శంకరరావు, చంద్రమోహన్, ప్రతాపరావు శ్రీనివాసరావు, చంద్రరావు, జగన్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు పరిధి భానోజీతోట కాలనీలో చేపట్టిన టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి స్థానికులు స్వచ్ఛందంగా విచ్చేసి సభ్యత్వాలు పొందారు. కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు సభ్యత్వ నమోదు శిబిరాన్ని సందర్శించి కాలనీలో సభ్యత్వ నమోదు పూర్తయ్యేంత వరకు శిబిరాన్ని కొనసాగించాలని సూచించారు. అలాగే గిరిజా కాలనీలో టీడీపీ స్థానిక నాయకులు సభ్యత్వ నమోదు చేపట్టారు.

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు పరిధి శనివాడ, గల్లవానిపాలెం, షిర్డీసాయి నగర్ ప్రాంతాల్లో ఆదివారం టీడీపీ సభ్యత్వ నమోదు శిబిరాలను నిర్వహించారు. కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ పలువురితో సభ్యత్వాలను నమోదు చేయించారు. కార్యక్రమంలో నాయకులు కరణం జగదీశ్, ఎం.వెంకటరావు, జి.సూర్యనారాయణ, ఎస్.సింహాచలం, సుబ్బరాజు, రుద్రకుమార్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా టైలర్స్ అసోసియేషన్ కార్యవర్గం

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా టైలర్స్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆదివారం బీహెచ్‌పీవీ వద్ద సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంది. అసోసియేషన్ నూతన గౌరవ అధ్యక్షుడిగా ఎ.సత్యనారాయణ, అధ్యక్షులుగా కూనూరు మల్లికేశ్వరరావు, మహిళా అధ్యక్షురాలుగా రొంగళి వర్ధిని, ఉపాధ్యక్షులుగా ఇ.త్రినాథరావు, ప్రధాన కార్యదర్శిగా దొడ్డి రామకృష్ణ, కోశాధికారిగా ఎ.గౌరీశంకర్ తదితరులు ఎన్నికయ్యారు.